
J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 43 26.3.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# అనగనగా.. ఒక కాంగ్రెస్



## చరిత్రలో కలిసిపోయిన చరిత్రాత్మక పార్టీ







**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ళు ప్రతిపక్షంలో ఉన్న తరువాత డా॥ వైయస్ రాజశేఖరరెడ్డి సారథ్యంలో 2004లో మళ్ళీ 2009లో వరుసగా ఘనవిజయం సాధించింది కాంగ్రెస్‌పార్టీ. అదే రాజశేఖరరెడ్డి వారసుడు జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక, 2019 నాటికి కాలగర్భంలో కలిసిపోయింది. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ కేవలం 60 నెలల కాలంలో నేలమట్టమై, ఆంధ్రాలో కనపడకుండా పోయింది. ఇప్పుడు అదే వైయస్ వారసురాలు షర్మిల దెబ్బకి తెలంగాణలో కూడా కాంగ్రెస్ కనుమరుగైపోయే ప్రమాదముందని విశ్లేషకుల అంచనా.**

*అనగనగా ఒక రాజు ఉండేవాడు, ఆ రాజుకి ఏడుగురు కొడుకులుండేవారు... ఇదీ చిన్న పిల్లలకు పెద్దలు అనాదిగా చెప్తూ వస్తున్న కథ. వందల సంవత్సరాలుగా వాళ్ళు వేటకు వెళ్తూనే ఉన్నారు. ఏడు చాపలను తెచ్చి ఎండ పెడుతూనే ఉన్నారు. ఒక చేప ఎప్పటికీ ఎండడం లేదు, అందుకు దాని కారణాలు దానికున్నాయి. భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్‌పార్టీ కథ కూడా ఇదే! పాలిటిక్స్‌లో ఓనమాలు నేర్చుకునే రాజకీయ విద్యార్థులకు ఒక జరిగిపోయిన కథలాగా చెప్పే దీనస్థితికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో కాంగ్రెస్‌పార్టీ చేరుకుంటోందని రాజకీయ మేధావుల అంచనా.*

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తిరుగులేని పార్టీగా కాంగ్రెస్ చలామణి అవుతున్న కాలంలో 1982లో స్వర్గీయ యన్.టి.రామారావు ఆత్మగౌరవం నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. అనంతరం అనూహ్య విజయాన్ని సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. అప్పట్లో రాజకీయాలకు ఆయన కొత్త కావడంతో, కుట్రలతో కూడిన కుళ్ళు రాజకీయాలకు అలవాటుపడడానికి ఆయనకు కొంత సమయం పట్టింది, ఫలితంగా పార్టీ ఓటమి చవిచూసింది. 1989లో మళ్ళీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ తరువాత 1994 – 1999 ఎన్నికలలో ఓడిపోయింది. 1995 ఆగష్టులో మామకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు పార్టీని లాక్కోవడం, 1996లో రామారావు కన్ను మూయడంతో బాబే పార్టీ చీఫ్‌గా అవతరించడం, పదేళ్లపాటు అధికారం చెలాయించడం అన్నీ తెలిసిన కథలే.

10సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉండి నిర్జీవంగా ఉన్న కాంగ్రెస్‌పార్టీకి తన పాదయాత్రతో ఊపిరిపోశారు దివంగత మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి. 2004 నాటికి పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపి బ్రహ్మాండమైన మెజారిటీతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చిన ఘనత వై.యస్‌ది.


ఆయన చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు పరిపాలనలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలతో కాంగ్రెస్‌పార్టీ నిలదొక్కుకుని 2009లో రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత 2009 సెప్టెంబర్ 2న జరిగిన ప్రమాదంలో, ఆ మహా నాయకుడిని తెలుగు ప్రజలు కోల్పోవడంతో ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజశేఖరరెడ్డి తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన ఓదార్పు యాత్రకు పార్టీ అధిష్టానం అడ్డు చెప్పడంతో సోనియమ్మను జగన్ ఎదిరించడం, సొంతంగా పార్టీని ప్రకటించి ప్రజల మధ్యకు వెళ్లడం, జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూడలేక, రాజకీయ అజ్ఞానుల మాటలు విని సోనియా రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడం చకచకా జరిగిపోయిన సంఘటనలు.

10లో




## సుప్రీం స్థానానికి.. జస్టిస్ రమణ

### ప్రతిపాదించిన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి



**రాజకీయ ఊహాగానాలకు దాదాపుగా తెరపడినట్లే! భారతదేశ తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎవరన్న ప్రశ్నకు సమాధానం లభించినట్లే! సీనియార్టీ ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎన్నిక కావాల్సిన వ్యక్తిపై కనీవినీ ఎరుగని రీతిలో ఆరోపణలు చేసి, ఆయన నియామకాన్ని అడ్డుకోవాలని చూసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నం ఫలించలేదు. ఆంధ్రా ప్రభుత్వం చేసిన ఆరోపణల్లో పస లేదంటూ ప్రభుత్వ ఫిర్యాదును కొట్టిపారేసిన సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి శరద్ బోబ్డే.. జస్టిస్ ఎన్.వి.రమణనే తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా సిఫారసు చేస్తూ కేంద్ర న్యాయశాఖకు లేఖ పంపారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే.. భారతదేశ అత్యున్నత న్యాయ స్థానం పీఠంపై కూర్చునే రెండవ తెలుగు వ్యక్తిగా జస్టిస్ ఎన్.వి. రమణ చరిత్రలో నిలుస్తారు.**

12లో

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

## పర్యవేక్షణకు 9 మంది సభ్యుల నియామకం



నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 3 వరకు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. పి.అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైకాపా యువజన విభాగం జిల్లా అధ్యక్షులు పి.రూప్‌కుమార్‌యాదవ్‌లు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ శ్రీరంగం తరువాత నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయానికి ఎంతో చరిత్ర వుందని, ఈ నేపథ్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ఉత్సవాల పర్యవేక్షణకు మంత్రి అనిల్‌కుమార్ 9 మందిని ఉత్సవ కమిటీ సభ్యులను ఎంపిక చేయడం జరిగిందని, ఈ కమిటీనే తరువాత కూడా కొనసాగించాలని అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంత్రి అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వం, దేవాదాయశాఖ కమిషనర్ బ్రహ్మోత్సవాల పర్యవేక్షణకు 9 మంది సభ్యులను నియమించడం జరిగిందన్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన శ్రీరాం వెంకటసురేష్, కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన టి.వి.నరసింహాచార్యులు, చందులూరు రమేష్, పాలకీర్తి అమ్మణ్ణి, మిరియాల శివకామి, గండవరపు శ్రీహరిరెడ్డి, గుత్తి రమాదేవి, టి.శేషయ్య, పద్మావతిలకు ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మోత్సవాల మొదటిరోజు 9 మంది కమిటీ సభ్యుల పేర్లతో దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, బ్రహ్మోత్సవాల అంకురార్పణ రోజే ఈ ఉత్తర్వులు రావడం సంతోషంగా ఉందన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో సభ్యులందరూ అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకొని ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని, అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి అనిల్‌కుమార్ నమ్మకాన్ని నిలబెట్టాలని కోరుకుంటున్నామన్నారు. సభ్యులుగా ఎంపికైన వారు భక్తితో, చిత్తశుద్ధితో పనిచేయాలని, భగవంతునికి సేవ చేసే అదృష్టం కలగడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కొణిదల సుధీర్, వందవాశి రంగా తదితరులు పాల్గొన్నారు.

# తెల్లవారకముందే.. కడతేరిపోయారు

- రోడ్డు ప్రమాదంలో అయిదుగురు కష్టజీవులు కన్నుమూత
- దువ్వూరు వద్ద దారుణం



***రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కష్టజీవులు బతుకుతెరువు కోసం కూలిపనులు చేయడానికి వేకువనే బయలుదేరారు. అయితే ఆ నిరుపేదలు రోడ్డు ప్రమాదరూపంలో వచ్చిన మృత్యు రాకాసి కోరలకు బలైపోయారు. తెల్లవారక ముందే అయిదుగురు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. వారి మరణంతో వారి కుటుంబ సభ్యులు పెద్దపెట్టున రోదిస్తున్నారు. ఈ ఘటన జిల్లావాసులకు ఆవేదన కలిగించింది.***

నెల్లూరు జిల్లా సంగం మండలం దువ్వూరు గ్రామానికి చెందిన పలువురు కూలీలు నిత్యం చేపలవేటకు వెళ్ళి తమ కుటుంబాలను పోషించుకునేవారు. ఈనెల 23న కూడా అలాగే వెళ్ళారు. వేకువనే లేచి జాతీయరహదారి దాకా వెళ్ళి అక్కడ మరో వాహనంలో ఎక్కుతున్న సమయంలో నెల్లూరుకు వెళ్తున్న ఓ పాల వ్యాను వేగంగా వచ్చి ఢీకొనడంతో అయిదుగురు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఏడుగురు గాయాల పాలయ్యారు. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా హాహాకారాలు మిన్నుముట్టాయి. రోడ్డంతా నెత్తుటేరుగా మారింది. చిన్నాభిన్నమైన దేహాలతో కూలీలు నేలకూలిపోయారు. వారు తమ వెంట తెచ్చుకున్న గిన్నెల్లోని అన్నమంతా నేలపాలైంది. ఈ దారుణంతో దువ్వూరు గ్రామం శోకసాగరమైంది.. ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దువ్వూరు ఎస్‌సి కాలనీకి చెందిన 18 మంది, ముక్కావురానికి చెందిన నలుగురు కూలీలు విడవలూరు మండలంలో చేపలు పట్టేందుకు బయలుదేరారు. వాళ్ళంతా వాహనం ఎక్కుతుండగా మైదుకూరు ప్రాంతం నుంచి వేగంగా వస్తున్న పాలవ్యాను వీరిని ఢీకొనడంతో దువ్వూరుకు చెందిన గాలి శీనయ్య (55), కోటపూరి మాలకొండయ్య (61), తువ్వర రమణయ్య (57), కంచర్ల బాబు (60) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన మోచర్ల శీనయ్యను చికిత్స కోసం నెల్లూరుకు తరలిస్తుండగా దారిలోనే కన్నుమూశాడు. ఈ ఘటనలో పాలవ్యాను డ్రైవర్‌తో పాటు, వాహనం ఎక్కుతున్న మరో అయిదుగురికి కూడా గాయాలయ్యాయి. కుటుంబాలను పోషించుకోవాలని కూలికెళ్ళడానికి పోతుంటే.. చివరికి ప్రాణాలే కోల్పోవాల్సి వచ్చిందంటూ మృతుల కుటుంబ సభ్యులు పడుతున్న వేదనా రోదనలు అంతా ఇంతా కాదు. ఈ ఘటనతో జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకుని నెల్లూరు రూరల్ డిఎస్పీ హరినాథ్‌రెడ్డి, సంగం తహశీల్దారు రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులను ఆసుపత్రుల్లో చేర్పి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గవర్నర్ దిగ్భ్రాంతి.. మంత్రి మేకపాటి సంతాపం

దువ్వూరు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంపై రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఈ సంఘటన తనను కలచివేసిందంటూ విచారం వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, బాధితులకు అత్యవసర వైద్యం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

### ఖైదీల్లో మార్పుకు..

# జైలు వార్డెన్లదే కీలక బాధ్యత

## వివిఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి



ఖైదీల్లో మంచి మార్పు తెచ్చేందుకు జైలు వార్డెన్లు కీలక బాధ్యతను పోషించాలని, ఖైదీల్లో ఎవరైనా చదువుకున్నవారుంటే వారికి ఉన్నత చదువులు చదువుకునేందుకు సేవాభావంతో ప్రోత్సహించాలని వివిఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్ విజయకృష్ణారెడ్డి అన్నారు. ఈనెల 20న నెల్లూరులోని పోలీసు శిక్షణా కేంద్రంలో జైలువార్డెన్లుగా శిక్షణ పొందుతున్న సుమారు 70 మంది విక్రమ సింహపురి యూనివర్సిటీని సందర్శించి యూనివర్సిటీలో బోధనా పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్‌వికె మాట్లాడుతూ జైలు వార్డెన్లు ఖైదీల మానసిక స్థితిని అంచనా వేసి వారు సన్మార్గంలో పయనించేందుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ బివి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నాడు-నేడు పనులు

# 80 శాతం పూర్తి

**- డిఇఒ రమేష్**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' పథకం పనులు జిల్లాలో 80 శాతం దాకా పూర్తయ్యాయని డిఇఒ రమేష్ చెప్పారు. ఈనెల 23న సైదాపురంలోని జివిఎస్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మింగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో రాష్ట్రంలోని పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. జిల్లాలోనూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

### విశాఖ ఉక్కు..

# ప్రైవేటీకరణ దారుణం

## ఏపి ఎన్జీఓల సంఘం నాయకులు

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేయడం దారుణమని, కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జరిగే భారత్‌బంద్‌కు ఏపి ఎన్జీఓల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు నలమోతు చంద్రశేఖర్‌రెడ్డి, బండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈనెల 22న నెల్లూరు ఎన్జీఓ హోంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయిస్తే లాభాల బాట పడుతుందని చెప్తున్నా కేంద్రం వినిపించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు ఆ ఫ్యాక్టరీని అప్పజెప్పాలని చూడడం సమంచితం కాదన్నారు.

### 'నవరత్నాల పథకాల'తో.. ప్రజా సంక్షేమ పాలన

ప్రజలకు నవరత్నాల పథకాలను అందిస్తూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారని, ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న అద్భుతమైన సంక్షేమ పథకాల వల్లనే ఇటీవలి ఎన్నికల్లో సిఎంకి ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఏపి ఎన్జీఓల సంఘం రాష్ట్ర నాయకులు కొనియాడారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూడా ప్రభుత్వం ఎంతో సానుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగులు ఎల్లప్పుడూ అండగానే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగసంఘం నాయకులు బండి శ్రీనివాసరావు, సిహెచ్‌వి శేఖర్‌రావు, ఆంజనేయవర్మ, మన్నేపల్లి పెంచలరావు, లక్కాకుల పెంచలయ్య, మధు, రాజేంద్ర, వెంకటేశ్వర్లు, కరుణమ్మ, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బట్టేపాటి మృతి..పార్టీకి తీరని లోటు

## సోమిరెడ్డి నివాళి

ఇందుకూరుపేట మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బట్టేపాటి యానాదినాయుడు మృతి పార్టీకి తీరని లోటని మాజీమంత్రి, టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 22న ఆయన బట్టేపాటి స్వస్థలమైన నరసాపురానికి వెళ్ళి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. టిడిపి ఆవిర్భావం నుంచి యానాదినాయుడు పార్టీకోసం పనిచేశారని, గత పాతికేళ్ళుగా నరసాపురం గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. ఈ సందర్భంగా బట్టేపాటి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. సోమిరెడ్డి వెంట మండల పార్టీ నాయకులు వీరేంద్రచౌదరి, ఈదూరు చెన్నయ్య తదితరులున్నారు.

### కర్రసాముకు సై అంటున్న..

# నరసాపురం విద్యార్థులు

ఇందుకూరుపేట మండలంలోని నరసాపురం ఎంవిఆర్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కర్ర సాములోనూ సత్తా చాటుతున్నారు. ఎక్కడ పోటీలకు వెళ్ళినా తమ ప్రతిభ నిరూపించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ సిలంబం (కర్ర సాము) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా తమ స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు జాఫర్, సుభాష్‌చంద్రబోస్, అభిత్, విల్సన్‌లు ప్రతిభతో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, త్వరలో తమిళనాడులో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులందరినీ ఆయన అభినందించారు.

# గురుమూర్తి 29న నామినేషన్ వేస్తారు

**వైకాపా నేత వైవి సుబ్బారెడ్డి**



తిరుపతి ఉప ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా డాక్టర్ గురుమూర్తి ఈనెల 29న నామినేషన్ దాఖలు చేయ నున్నారని వైకాపా చిత్తూరుజిల్లా ఇన్‌చార్జి, టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి ప్రకటించారు.

తిరుపతిలో ఈనెల 24న జరిగిన కార్యక్ర మంలో ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో కలిసి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వైకాపా ఎంపి అభ్యర్థి డాక్టర్ గురుమూర్తిని వారికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ గురుమూర్తిని వైకాపా ఎంపి అభ్యర్థిగా ముఖ్యమంత్రి ఎంపిక చేశారన్నారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో నాయకులు కార్యకర్తలు అందరూ కలసి సమన్వయంతో పనిచేసి ఈ ఎన్నికల్లో గురుమూర్తిని గెలిపించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పాలన గురించి ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజెప్పాలని, దేశం మొత్తం తిరుపతి వైపు చూసేలా వైకాపా అభ్యర్థి అఖండ మెజార్టీని సాధించేలా అందరూ కృషిచేయాలని చెప్పారు. డిప్యూటి సిఎం నారాయణస్వామి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డితో పాటు జిల్లా నాయకులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కిలివేటి ఆధ్వర్యంలో..

# నాయుడుపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**- కొత్త ఛైర్‌పర్సన్ కటకం దీపిక**



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయుడుపేట మునిసి పాలిటీని ఆదర్శ మునిసి పాలిటీగా తీర్చిదిద్దుతామని కొత్త ఛైర్‌పర్సన్ కటకం దీపిక చెప్పారు.

ఈనెల 24న నాయుడు పేట మునిసిపల్ కార్యాల యంలో ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసిన తాను ప్రజాసేవ చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె ఈ సందర్భంగా కొనియాడారు. ఎమ్మెల్యే సంజీవన్న సిఎం జగన్ బాటలో నడుస్తూ తనకు కూడా రాజకీయాల్లో అవకాశం కల్పించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో మునిసి పాలిటీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమెను వైకాపా నాయకుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి అభినందించారు. వైకాపా నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, పేట చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రం విధానాలు

# దారుణం

**- సిపిఎం నేత మధు**



కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధా నాలు దారుణంగా ఉంటున్నాయని, కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను అవ లంభిస్తోందని సిపిఎం రాష్ట్ర నాయకులు మధు విమర్శించారు. నెల్లూరులో ఈనెల 24న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొడు తోందని ఆయన ఆరోపించారు. కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టా లను వెంటనే రద్దుచేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను మానుకో వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజ నాల దృష్ట్యా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వంతో పాటు విపక్షాలు భారత్ బంద్‌కు సంఘీభావం తెలపడం సంతోష కరమన్నారు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా యాదగిరిని బరిలోకి దించామని చెప్పారు. ఆయనతో పాటు సిపిఎం నాయకుడు చంద్ర రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### రామ్‌చరణ్ పుట్టినరోజున..

# రక్తదానం

ప్రముఖ సినీనటుడు రామ్‌చరణ్‌తేజ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 24న ఇందుకూరుపేటలోని గంగపట్నం గ్రామంలో రామ్‌చరణ్‌తేజ అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించి సుమారు 95 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానమంటే ప్రాణదానం చేసినట్లే అని, యువత సేవాభావంతో రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకుడు హరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైకాపా నాయ కులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, మంచికంటి శ్యామ్‌కుమార్, రవికుమార్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యకు శీనయ్య అరకోటి విరాళం



అయోధ్యలో ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న రామ మందిరం నిర్మాణానికి తనవంతు విరాళంగా 50లక్షల రూపాయలను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అందజేశారు. ఢిల్లీలోని తన నివాసంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్‌రాయ్‌కు ఆయన ఈ మొత్తాన్ని చెక్కురూపంలో ఇచ్చారు.

### టిడిపి అభ్యర్థి..

# పనబాక లక్ష్మి నామినేషన్



తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేస్తున్న కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి ఈనెల 24వ తేది ఉదయం నెల్లూరులోని కలెక్టరేట్‌కు వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఆమె వెంట మద్దతుగా టిడిపి రాష్ట్ర నాయకులు అచ్చె న్నాయుడు, నిమ్మల రామానాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, అమర్‌నాథరెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి, విఆర్‌సి సెంటర్‌లో ఉన్న డా. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకుంటామని నమ్మించి, ఇప్పుడేమో ఆర్థికసంఘం ఒప్పుకోవడం లేదంటూ సాకులు చెప్తున్నారని, ప్రత్యేక హోదా, విభజన హామీలు తదితరాలను తుంగలో తొక్కేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పేందుకు సమయం ఆసన్నమైందని, తిరుపతి ఉప ఎన్నికల్లో ఓటుతో తెలుగోడి సత్తా చాటాలని ఆమె పిలుపునిచ్చారు. మాజీమంత్రి యనమల రామకృష్ణుడు, నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్, నెలవల సుబ్రహ్మణ్యం, పరసా రత్నం, చెంచలబాబుయాదవ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

### జె.ఇ.ఇ ఫలితాల్లో

# విశ్వసాయి ప్రతిభ




జె.ఇ.ఇ మెయిన్స్ - 2021 ఫలితాల్లో నెల్లూరు విశ్వసాయి విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. వై.శ్యామ్‌సాయి 97.35 పర్సంటైల్, ఐ.వేదసాయిప్రియ 96.25 పర్సంటైల్, టి.పురంధేశ్వర్‌రెడ్డి 96.18 పర్సంటైల్స్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబరి చారు. అదే విధంగా గణిత విభాగంలో వై.శ్యామ్‌సాయి, టి.పురంధేశ్వర్‌రెడ్డి 99.0 పర్సంటైల్ స్కోరు సాధించి తమ కళాశాల ప్రతిష్ట ఇనుమడింపజేశారని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా. యస్.సత్యనారాయణ ఆ విద్యార్థులను అభినందించారు. ఈ నెల 25వ తేదీ గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ ఉత్తమ ఫలితాలకు కారణమైన అధ్యాపక అధ్యాపకేతర బృందాన్ని ఆయన అభినందించారు. కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు.. నారాయణరెడ్డి


**○ దేహ సమర్పణతో సర్వత్రా అభినందనలు**



నెల్లూరీయుడైన నేదురుమల్లి నారాయణరెడ్డి తాను మరణిం చినా తన శరీరం సమాజానికి ఉపయోగపడాలనే సదాశయంతో తన దేహాన్ని వైద్యకళాశాలకు సమర్పించి ఆదర్శప్రాయునిగా నిలవడం అందరి అభినందనలు అందుకుటోంది. నారాయణరెడ్డి దేహసమర్పణకు సంబంధించి నెల్లూరులోని పినాకిని దేహ సమర్పకుల సంస్థ నిర్వాహకుడు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఆ వివరాలను తెలియజేశారు. నెల్లూరు ఆదిత్యనగర్ నివాసి, పినాకిని దేహ సమర్పకుల సంస్థ సభ్యుడు నేదురుమల్లి నారాయణరెడ్డి తన 61వ ఏట గుండెపోటుతో ఈనెల 23న హఠాత్తుగా మర ణించారు. వారి జీవిత భాగస్వామిని అయిన నిర్మల ఏడేళ్ళ క్రితం 2013లో పినాకిని సంస్థను సంప్రదించి వారిరువురు ఒకరోజు దేహసమర్పణ ప్రమాణం చేసి, వారు ఒకరికొకరు, కుమారుడు సందీప్‌రెడ్డి సాక్షులుగా పినాకిని సంస్థలో సభ్యు లయ్యారు. అయితే ఇంకా చాలా కాలం జీవించి ఉండాల్సిన నారాయణరెడ్డి హఠాన్మరణం చెందగా, ఆయన సతీమణి నిర్మల స్వయంగా ఆ సమాచారాన్ని పినాకిని సంస్థకు తెలిపి, ఏడేళ్ళనాటి వారి దేహ సమర్పణ ప్రమాణం సకాలంలో అమలవడానికి ఆమె చూపిన శ్రద్ధ ఎంతో ఆదర్శప్రాయం. అదేరోజు జరిగిన నారాయణరెడ్డి అంతిమప్రయాణం స్మశానానికి కాక తన శరీరాన్ని మానవ శరీర నిర్మాణ శాస్త్ర పాఠా లను విద్యార్థులకు బోధించేందుకు వీలుగా నారాయణ వైద్య కళాశా లకు సాగింది. కరోనా వ్యాప్తి వల్ల నేత్రస్వీకరణ జరగడం లేదు. కళాశాల నుంచి సంబంధిత విభాగం సిబ్బంది కొల్లు రమేష్, అలగల వెంకటరమణయ్య వచ్చి వాహనంలో నారాయణరెడ్డి మృతదేహాన్ని తీసుకువెళ్ళగా, ఆయన కుమారుడు సందీప్‌రెడ్డి సమక్షంలో తన తండ్రి దేహాన్ని కళాశాలలోని సహ ఆచార్యులు కె.దేవిశంకర్‌కు అందజేశారు. ఆ విభాగాధిపతి వైద్యులు ఆచార్య లట్టుపల్లి హేమ కళాశాల పక్షాన ఇందుకు తోడ్పడ్డారని, కరోనా పరిస్థితుల్లో దేహ సమర్పణ లను పినాకిని సంస్థ దూరవాణి ద్వారా పరోక్షంగా ఉండి నిర్వ హిస్తున్న నేపథ్యంలో నారాయణరెడ్డి కుటుంబమిత్రులు శివయ్య ఆ కుటుంబ ప్రతినిధిగా కార్యక్రమ నిర్వహణకు ఎంతగానో తోడ్పడ్డారని వివరించారు. పినాకిని దేహ సమర్పకుల సంస్థ నిర్వహణలో ఇది 28వ దేహ సమర్పణ అని ఆయన తెలిపారు.

## 'ప్రభా'తం

# జగతికి 'జలమే' బలం



**జగతికి జలమే ప్రాణాధారం. అయినా జల వనరుల సంరక్షణ పట్ల మనం ఇంకా అలక్ష్యంగానే ఉంటున్నాం. అసలే భూ తాపంతో, కరువు కాటకాలతో, వర్షాభావంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతూ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వానలు, వరదల వచ్చే అపార జలరాశిని వదిలేసుకుంటూ.. గుక్కెడు తాగునీటి కోసం తంటాలుపడే దుర్దశ ఇంకా తొలగిపోవడం లేదు. ఇకనైనా మేలుకోవాలి. ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టుకోవాలి. జల సంరక్షణను మాటల్లో కాక అదొక పవిత్రమైన యజ్ఞంగా భావించాలి. అందుకు పాలకులతో పాటు ప్రజలంతా అపర భగీరథులై ఎంతో దీక్షతో ముందుకు సాగాలి.**

మానవజాతి మనుగడకే కాదు..జీవరాశులెన్నిటికీ, చివరికి చెట్టుచేమలకు సైతం నీరే ప్రాణాధారం. జగతికి జలమే..జీవం. జలమే బలం.. అందరికీ జీవనాధారం. అయినా పరిశుభ్రమైన జలాలను పరిరక్షించుకోవడంలో మనకు ఏమాత్రం శ్రద్ధ ఉండకపోవడం ఎంతో బాధాకరం. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచమంతటా రానురాను జీవజలాలు కరువవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జలసంక్షోభం ముంచుకొస్తోందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడం, నీటి వనరులను సంరక్షించుకోవడం, ప్రకృతిని, పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవడం వంటివన్నీ కేవలం నినాదప్రాయంగానే మిగులుతున్నాయి. అందులోనూ సర్వశక్తి సమన్వితుడైన మానవుడు జలవనరులను కాపాడుకోలేకపోవడమే కాక, వాటిని చేజేతులా విషతుల్యం చేస్తూ, తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్న చందంగా.. ఎంతోకాలంగా తన జీవితయాత్రను అభద్రతగానే సాగిస్తుండడం ఎంతైనా విచారకరం. ఈ దుస్థితిని గమనించే 'ఐక్య రాజ్య సమితి' ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా జలాలను పరిరక్షించుకోవాలని పిలుపునిస్తూ, ప్రతి ఏటా మార్చి 22వ తేదిని 'ప్రపంచ జల దినోత్సవం'గా జరుపుకోవాలని 1993లోనే ప్రకటించింది. తద్వారా ఎవరికి వారు సురక్షిత జలాలను సంరక్షించుకోవాలని సూచించింది. జలసంరక్షణపై దృష్టి పెట్టకపోతే ప్రపంచంలోని 80కి పైగా దేశాలు భవిష్యత్తులో తీవ్రమైన జలసంక్షోభానికి గురవుతాయని హెచ్చరించింది. అందులో భారత్ కూడా ఒకటని వేరే చెప్ప నక్కర లేదు. సురక్షితమైన జలాలున్న దేశాల జాబితాలో మనం అట్టడుగునే ఉన్నామని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నీటి నాణ్యతకు సంబంధించి 122 దేశాల సూచికలో మనదేశం 120వ స్థానంలో ఉండడం చూస్తే పరిశుభ్ర జలాల వినియోగం విషయంలో మనం ఎంతగా వెనుకబడి ఉన్నామో అర్ధమవుతుంది. అయినప్పటికీ జలాల పట్ల, జలవనరుల సంరక్షణ పట్ల ఇంకా మనం నిర్లక్ష్యంగానే ఉంటున్నాం. పరిశుభ్రమైన నీరు కరువై అనేకదేశాల్లో ప్రజలు అనేకానేక రోగాల బారిన పడుతున్నారు. మనదేశంలో కూడా అదే దుస్థితి. ప్రజలకు ఆరోగ్యప్రదమైన మంచినీటిని అందించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుండడం వల్లే దేశంలో అనేక చోట్ల నీటి ఎద్దడితో ప్రజలు నిత్యం అల్లాడుతున్నారు. గుక్కెడు నీరు కూడా దొరక్క ఎన్నో గ్రామాల్లో ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. జలవనరులను కాపాడుకోలేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. మనదేశంలో లభిస్తున్న నీటిలో అత్యధికశాతం నీటిని తాగునీటి అవసరాలకు, వ్యవసాయానికి వినియోగిస్తున్నాం. అందుకు భూగర్భజలాలను అందినంత మేరే తోడేస్తున్నాం. అంతే తప్ప నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు తవ్వుకోవడమో లేదా చెరువులు, దొరువులు నిర్మించుకోవడమో చేయడం లేదు. భూగర్భ జలాలను పరిరక్షించుకోవడం లేదు. సురక్షితమైన నీటితోనే ఆరోగ్యం లభిస్తుంది. లేకుంటే అనారోగ్యం తప్పదు. 'జలమో రక్షతి రక్షిత:' అన్నట్లుగా జలాన్ని కాపాడుకుంటే ఆ జలమే మనల్ని కాపాడుతుంది. ఇప్పటికే భూ తాపంతో, కరువు కాటకాలతో, వర్షాభావంతో అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతూ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ప్రకృతిమాత కరుణించి అప్పుడప్పుడూ మనకు వర్షాల వరాల జల్లులు కురిపిస్తున్నా ఆ నీటిని కూడా ముందుజాగ్రత్తగా సంరక్షించుకోలేకపోతున్నాం. ప్రకృతి మనకు ఉచితంగా నీరిచ్చినా, ఇప్పటికే మంచినీటిని మనం డబ్బులిచ్చి కొంటున్నాం. జలవనరులను కాపాడుకోకుంటే.. డబ్బులిచ్చినా నీటి చుక్క దొరకని పరిస్థితి ఏర్పడుతుందేమో?! వానలు, వరదలతో వచ్చే అపార జలరాశిని పోగొట్టుకుని, గుక్కెడు తాగునీటి కోసం తంటాలు పడే దుర్దశ ఇంకా తొలగిపోవడం లేదు. 'ఉప్పొంగే నదుల జీవజలాలు.. ఉప్పు సముద్రం పాలు' అని ఎప్పుడో ఒక సినీకవి అన్నట్లుగా మంచినీటి వనరులను, జీవ జలాలను సంరక్షించేందుకు మన దేశంలో ఎంతోకాలం నుంచి ఆశించినస్థాయిలో పటిష్టమైన ప్రణాళికలు లేకపోవడంతో వర్షపు నీరంతా వ్యర్థమైపోతోంది. ఎప్పటికప్పుడు జలవనరు లను సంరక్షించుకోవాలని మనకు మనం అనుకుంటున్నామే తప్ప, ఆచరణలో ఆ కార్యక్రమాలన్నీ నామమాత్రంగానే ఉంటున్నాయి. అడవులను సంరక్షించుకోవాలి. మొక్కలను విస్తారంగా నాటుతూ పరిరక్షించాలి. వృక్ష సంపదను కాపాడుకోవాలి. జలసంక్షోభం రాకుండా చూసుకోవాలి. ఇవన్నీ ఎంతో బృహత్తరమైన కార్యక్రమాలే. అయినా, రకరకాల పథకాలతో లక్షల కోట్లు ఖర్చుపెడుతున్న ప్రభుత్వాలు అన్నిటికన్నా ముఖ్యమైన జలవనరుల పట్ల నిర్లిప్తంగానే ఉంటుండడం సముచితం కాదు. ముఖ్యంగా దేశంలో నదుల అనుసంధాన ప్రక్రియలు ఎంతో కాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుండడంతో వాన నీరు, వరద నీరంతా వృధా అయిపోతోంది. నదుల అనుసంధానంతోనే దేశానికి జలకళ..జీవకళ వస్తుంది. ఆ ప్రయత్నాలు ఇకనుంచైనా ముమ్మరంగా సాగాలి. అంతేకాదు, నదీజలాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేసుకోవాలి. నీటిని పొదుపు చేసుకోవాలి. విచ్చలవిడి నీటి వాడకాలను అదుపు చేసుకోవాలి. ప్రతి నీటి బొట్టూ ఎంతో విలువైనదని గ్రహించాలి. జల సంరక్షణను కేవలం మాటల్లో కాక అదొక పవిత్రమైన యజ్ఞంగా భావించాలి. అందుకు పాలకులతో పాటు ప్రజలంతా అపర భగీరథులు కావాలి. ఊరు వాడా అంతా ఏకమై ఎక్కడికక్కడ జలాలను, జలవనరులను సంరక్షించుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వాలు, మేధావులు.. ప్రజలు అందరూ కలసి కదిలితేనే 'జల సంరక్షణ యజ్ఞం' సాకారమవుతుంది. మన తరానికే కాక, భావితరాలకు కూడా మనం మార్గదర్శకమైనట్లుంటుంది.

# తక్కువ వడ్డీకే రుణాలివ్వండి

**- డిసిసిబి పర్సన్ ఇన్‌చార్జి, జేసీ హరేందిరప్రసాద్**



నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రైతులకు, పొదుపు మహిళలకు సులభతరమైన విధానంలో తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) పర్సన్ ఇన్‌చార్జి, జేసీ హరేందిరప్రసాద్ సూచించారు. నగరంలోని డిసిసి బ్యాంకులో ఈనెల 22న జరిగిన మహాజన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఆదాయ మార్గాలను పెంచుతూ వ్యయాలను తగ్గించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, రానున్న ఆర్థికసంవత్సరంలో బ్యాంకును లాభాల బాటలో పయనింపజేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిసిసిబి సిఇఓ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిసిఎంఎస్ ద్వారా రైతులకు ఎరువులు :

అనంతరం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021-22 సంవత్సరంలో డిసిఎంఎస్ ద్వారా 20 కోట్లతో రైతులకు నాణ్యమైన ఎరువులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డిసిఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని, వీటి ద్వారా 150 కోట్ల రూపాయల దాకా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

**- శ్రీ కమలానందభారతి స్వామీజీ**

దేవాలయాలను అందరూ పరిరక్షించుకోవాలని, హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని విజయవాడ భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానందభారతి స్వామీజీ అన్నారు. ఈనెల 20న స్వామీజీ మనుబోలు మండలంలోని మడమనూరులో ఉన్న గీతాశ్రమాన్ని, మనుబోలులోని శివాలయం తదితర ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దేవాలయాల కేంద్రంగా హిందూ ధర్మాన్ని అందరూ పరిరక్షించుకోవాలని భక్తులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉండే భక్తులు, దాతలు అందరూ అందుకు సహకరించాలన్నారు. అర్చకులు సాయిశర్మ, హనుమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పంటల బీమాకు.. 'ఆధార్'ను అనుసంధానం చేసుకోవాలి

**- వ్యవసాయశాఖ జేడీ ఆనందకుమారి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కోసం వరి, వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, చెరకు పంటలు వేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద వారి ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఆనందకుమారి చెప్పారు. ఈనెల 20న ఆమె నెల్లూరులోని తమ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఆధార్ అనుసంధానం చేసుకున్న రైతులకు సంబంధించి పంటల బీమాను ఏప్రిల్ నెలలో ప్రభుత్వం నగదు జమచేస్తుందని తెలిపారు. అదేవిధంగా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రైతులు పంట రుణం లక్ష రూపాయల దాకా తీసుకుని ఏడాది లోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించినట్లయితే ఆ వడ్డీని ప్రభుత్వం రైతుల ఖాతాలకు ఏప్రిల్ 16న జమ చేస్తుందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పిఎం కిసాన్‌కు సంబంధించి అర్హులైన రైతులకు నగదు జమ కానట్లయితే వారు వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటే రైతులు తప్పనిసరిగా వారి పంట వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని, వ్యవసాయానికి సంబంధించి ఏవైనా సమస్యలుంటే 15521 కాల్‌సెంటర్‌ను సంప్రదించాలని ఆమె రైతులకు సూచించారు.

# జగన్ ఒక రికార్డ్

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వరుసగా పంచాయితీలకు, మునిసిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. పంచాయితీలలో 90 శాతం స్థానాలు, మునిసి పాలిటీలలో, కార్పొరేషన్లలో 100 శాతం ఫలితాలు సాధించి, వై.సి.పి. పార్టీ తిరుగులేని ఆధిక్యత సాధించింది. భారతదేశ చరిత్రలో ఇది ఓ అరుదైన రికార్డు. జగన్ ముఖ్యమంత్రి అయి, రాబోయే మే 30 నాటికి 2 ఏళ్లు పూర్తవుతాయి. ఈ రెండేళ్లలో జగన్ జనరంజక పాలన అందించి, సంక్షేమ సారధిగా రాష్ట్ర ప్రజల గుండెల్లో కొలువయ్యారు. తండ్రి స్వర్గీయ రాజన్నను మరపించే విధంగా కులాతీత, మతాతీత సంక్షేమ పాలనతో రాష్ట్రాన్ని సంక్షేమ ఆంధ్రగా మార్చారు. ప్రజలు తనకు కట్టబెట్టిన అధికారాన్ని సద్వినియోగం చేశారు. దేశమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసే విధంగా విప్లవాత్మక కార్యక్రమాలు చారిత్రాత్మక నిర్ణయాలతో పాలన సాగిస్తున్నారు. ప్రతిపక్షాలు గత రెండేళ్లలో ఎన్నో ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించాయి. అయితే ప్రజలు వేటినీ విశ్వసించలేదు. తమ పాలకులు సంక్షేమ సారధి అని వారు గుర్తించారు. మరోసారి తమ ఓటుతో జగన్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకొన్నారు. దేశ చరిత్రలో ఇది ఓ అరుదైన సంఘటన. రెండేళ్లలో 2 సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డ వైయస్ జగన్‌ను దివినుండి తండ్రి రాజన్న దీవిస్తున్నారు. భూమి మీద రాష్ట్ర ప్రజలందరూ తమ శుభాశీస్సులు అందిస్తున్నారు. అద్భుత ఫలితాలు సాధించి చరిత్రను తిరగరాసిన సియం జగన్‌మోహన్‌రెడ్డి గారికి అభినందనలు.

*- డా. ఎన్.బాబూరావు, కావలి.*




# ఆచార్య ఆదిత్యకు నివాళి

నెల్లూరులోని ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఆచార్య ఆదిత్య గారి మృతి ఎంతో బాధాకరం. తానునమ్మిన సిద్ధాంతాలకు, ఏర్పరచిన సంస్థలకు, సాహితీ రంగాలకు, నిబద్ధతకు సమయపాలనకు ఆయన నిలువెత్తు నిదర్శనం. ప్రేమాభిలాషి-శ్రేయోభిలాషి. వేలాదిమంది విద్యార్థులకు ఆయన విద్యాభిక్ష పెట్టారు. తెలుగు భాష అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. చిన్నాపెద్దా తేడాలేకుండా ఆయన అందరినీ ఎంతో ఆప్యాయంగా పలుకరించేవారు. సాహిత్య సాంస్కృతిక రంగాలకు ముఖ్యంగా విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారు. నెల్లూరు విద్యారంగలో నిజంగానే ఆదిత్యునిలా ప్రకాశించారు. ఎంతో సౌమ్యుడు, సేవాగుణ సంపన్నుడు అయిన ఆదిత్యగారు లేని లోటు ఏనాటికీ తీరనిది. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి.

*- వనం సుబ్రహ్మణ్యం, కోవూరు.*

# ఇళ్ళ ముంగిళ్ళ వద్దకే కోవిడ్ టీకా

- ఇకనుంచి సచివాలయాల పరిధిలోనే వ్యాక్సిన్
- దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ సన్నాహాలు



*కోవిడ్ మహమ్మారిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చురుగ్గా చర్యలు తీసుకుంటున్నారు. జగన్ ఆదేశాలతో రాష్ట్రప్రభుత్వ యంత్రాంగం కోవిడ్ టీకాతో కరోనాను దూరం చేసేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలను చకచకా చేస్తోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా కోవిడ్ టీకాను సచివాలయాల కేంద్రంగా ప్రజల ముంగిళ్ళ చెంతకే చేర్చేందుకు ముఖ్యమంత్రి కృషిచేస్తుండడం పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయడానికి, తద్వారా కరోనాను నిరోధించడానికి ఈ చర్యలు ఎంతో ఉపయోగపడతాయని అందరూ భావిస్తున్నారు.*

వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆసుపత్రులకు వెళ్ళి వ్యాక్సినేషన్ చేయించుకోవడంలో ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఆ సమస్యలను అధిగమించేందుకు వారి ఇళ్ళ సమీపం లోనే ఉన్న సచివాలయాల వద్దనే టీకా వేసుకునేలా టీకా ప్రక్రియను మరింతగా ప్రజలకు చేరువ చేస్తున్నారు. వృద్ధులకు, దీర్ఘకాలిక రోగులకు ఈ ప్రక్రియ వల్ల మరింత ప్రయోజనకరంగా ఉండేలా, వారికి సులభతరంగా కోవిడ్ టీకా వేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గుంటూరుజిల్లాలో ఇందుకోసం ప్రయోగాత్మకంగా చేపట్టిన పైలట్‌ప్రాజెక్టు విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అదే విధానాన్ని అమలుచేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల పరిధిలో ఉండే 45 ఏళ్ళు దాటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, 60 ఏళ్ళు దాటిన వృద్ధులకు కోవిడ్ టీకా అందించేందుకు ముందుగా వారి వివరాలు సేకరించి, వ్యాక్సినేషన్ వేసేందుకు వలంటీర్లు, ఏఎన్ఎంలు వారికి అవగాహన కల్పిస్తారు. ముందు రోజే వారి ఆధార్ కార్డులను నమోదు చేసుకుని, మరుసటి రోజు ఉదయం 8గంటల నుంచే వారందరూ టీకా వేసుకునేలా చూస్తారు. ఇందువల్ల వీలైనంత త్వరగా వీలైనంత ఎక్కువ మందికి టీకా వేయవచ్చని భావిస్తున్నారు. ఇలా ఇళ్ళ సమీపంలోనే టీకా వేయడమన్నది దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో అవసరమైన ఈ టీకా ప్రక్రియ కూడా శరవేగంగా జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మందికి పైగానే ఉన్న ఏఎన్ఎంలు, 40 వేల మందికి పైగానే ఉన్న ఆశా వర్కర్లు, వలంటీర్ల ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. కేవలం ప్రభుత్వాసుపత్రుల్లోనే కాకుండా, సచివాలయాల ద్వారా రోజుకు కనీసం లక్ష మంది దాకా టీకా వేయించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండడం పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

## రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

రాష్ట్రంలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో వైరస్ రెండోదశ విజృంభిస్తుందేమోనన్న ఆందోళన సర్వత్రా నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ఈనెల 22వ తేదీ నాటికి 8,94,044 మంది కరోనా వ్యాధికి గురికావడంతో కరోనా నియంత్రణకు ప్రభుత్వం మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. మార్చి 24వ తేదీ గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'నో మాస్క్-నో ఎంట్రీ' విధానాన్ని అమలుచేయాలని అధికారులను ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యుహెచ్ఓ) సూచనల మేరకు 15 రోజుల పాటు కోవిడ్ వైరస్ వ్యాప్తిపై, దానిని నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అందరికీ అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ 7వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను కొనసాగించి ప్రజలకు కరోనా మహమ్మారి వ్యాధి గురించి, దానిని నివారించేందుకు ఇస్తున్న టీకా గురించి వివరిస్తారు.

# 'నిమ్మ'కు మంచిరోజులొచ్చాయ్



*ఎట్టకేలకు జిల్లాలోని నిమ్మ రైతులకు మంచిరోజులొచ్చాయి. నిమ్మ ధరలు బాగానే ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఎగుమతులు కూడా పెరిగాయి. చాలా రోజుల తర్వాత నిమ్మ మార్కెట్ కళకళలాడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.*

- ధరలు పెరిగాయి.. ఎగుమతులు జరుగుతున్నాయి
- చాలా రోజుల తర్వాత రైతుల్లో ఆనందం

ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు కరోనా మహమ్మారి ప్రభావం వెరసి..జిల్లాలోని నిమ్మరైతులకు గత కొద్దికాలంగా అన్నీ కష్టాలే. గత ఏడాది కరోనా దెబ్బకు నిమ్మ మార్కెట్లు కుదేలయ్యాయి. గూడూరు, పొదలకూరు మార్కెట్లు ఆరునెలల పాటు మూతపడ్డాయి. ఎగుమతులు లేక, నిమ్మకాయల రవాణాకు అవకాశం లేక, స్థానిక మార్కెట్లకు కూడా అమ్ముకునే వెసులుబాట్లు లేక తోటల్లోనే కాయల్ని ఎండబెట్టుకుని నానా అవస్థలు పడ్డారు. కరోనా కష్టకాలం నిమ్మరైతులకు తీరని కష్టాలను మిగిలించింది. ఇప్పుడా బాధలు క్రమేణా తీరిపోతున్నాయి. ఎలాగో ఇన్నాళ్ళ తర్వాత మళ్ళీ నిమ్మకాయల ధర కిలో 60 నుంచి 70 రూపాయల దాకా పెరగడం, ఎగుమతులు కూడా బాగానే జరుగుతుండడంతో నిమ్మరైతుల్లో ఆశలు చిగురించాయి. గూడూరు నిమ్మ మార్కెట్ కొనుగోళ్ళు విక్రయాలతో సందడిగా మారింది. నిమ్మకాయలు 80 కిలోల లూజు బస్తా ఇప్పుడు 4 వేల నుంచి 4500 దాకా ధర పలుకుతోంది. ప్రస్తుతం ఈ వేసవి కాలంలో నిమ్మకాయల వాడకం బాగా ఉంటుందని, ఫలితంగా నిమ్మ ధరలు మరింతగా పెరిగే అవకాశం కూడా ఉందని, ఇలా కొద్దికాలం సాగితే నష్టాల నుంచి కోలుకుంటామని నిమ్మ రైతులు చెప్తున్నారు.

## పెరుగుతున్న దిగుబడి

నిమ్మ పంటకు ఇది సీజన్ కావడంతో నిమ్మకాయల దిగుబడి బాగా పెరుగుతోంది. జిల్లాలోని గూడూరు, సైదాపురం, బాలాయపల్లి, రాపూరు, వెంకటగిరి, పొదలకూరు, సూళ్ళూరుపేట తదితర ప్రాంతాల్లో జిల్లా మొత్తమ్మీద దాదాపు 14వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతున్నట్లు అధికారుల అంచనా. పరిస్థితులన్నీ అనుకూలిస్తే సీజన్‌లో సుమారు 62వేల టన్నుల దాకా నిమ్మకాయల దిగుబడి ఉంటుంది కూడా. నిమ్మకాయలను సైజును, నాణ్యతను బట్టి గ్రేడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రధానంగా ఢిల్లీ, కలకత్తా, బెంగుళూరు, చెన్నై వంటి నగరాలకు నిత్యం ఎగుమతులు జరుగుతున్నాయి. ఎట్టకేలకు నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఉత్సాహంతో పంట సాగు మీద దృష్టి పెట్టారు.



### మా నియోజకవర్గంలో..

# దేవాలయాలు నిర్మించండి

## టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి.. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న వినతి

కోవూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఉన్న ఎస్‌సి, ఎస్టీ కాలనీల్లో దేవాలయాలను నిర్మించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈనెల 22న విజయవాడలో టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని కలిసి విన్నవించారు. తమ నియోజకవర్గంలో ఉన్న 16 ఎస్‌సి, ఎస్టీ కాలనీల్లో ఆలయాలు లేనందువల్ల ప్రజలు ఆధ్యాత్మిక చింతనకు దూరమవుతున్నారని, టిటిడి నిధులతో ఆ ప్రాంతాల్లో దేవాలయాలు నిర్మించాలని కోరుతూ తాను వినతిపత్రం సమర్పించగా అందుకు టిటిడి బోర్డు ఛైర్మన్ సానుకూలంగా స్పందించారని ప్రసన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నతో పాటు ఇఏపిసి ఛైర్మన్ దొడ్లరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి, రైతు విభాగం కార్యదర్శి నాపా వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ప్రముఖులను కలిసిన ప్రసన్న

ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల విజయవాడలో పలువురు మంత్రులను, అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబును గౌరవపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామ కృష్ణారెడ్డిని విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలను చర్చించారు. ఆ తర్వాత రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మిని తాడేపల్లిలోని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# విఆర్‌సి రికార్డు గదిలో మంటలు

- ప్రమాదమా?.. కావాలనే చేశారా?..
- విచారణ జరిపిస్తామన్న జేసీ



నెల్లూరు నగరంలోని విఆర్ విద్యాసంస్థలకు చెందిన రికార్డు గదిలో ఈనెల 22వ తేదీ సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు లేచాయి. విఆర్‌సి గ్రౌండ్‌లో ఉన్న క్రీడాకారులు గమనించి వెంటనే హెచ్ఎంకు సమాచారం అందించారు. విఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ హుటాహుటిన సిబ్బందిని పంపి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈలోగా అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం తెలియడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందేనని, ఎవరో ఆకతాయిల పనై ఉంటుందని అంటున్నారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో విఆర్ విద్యాసంస్థలు నడుస్తున్న నేపథ్యంలో ఈ కళాశాలకు చెందిన పలు రికార్డు గదులకు సీల్‌వేసి ఉన్నారు. ఈ గదిలో కీలక పత్రాలు, కంప్యూటర్లు వగైరాలు ఉన్నాయంటున్నారు. ఆ గదిలో అగ్నిప్రమాదం జరగడం ఏమిటనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రికార్డులను గల్లంతు చేయడానికే ఎవరో ప్రయత్నించి ఉంటారనే ఆరోపణలూ వస్తున్నాయి. ఇది అగ్నిప్రమాదమో?.. కావాలనే ఎవరైనా ఈ పనిచేశారో?.. నిజమేదో ఆ దేవుడికే తెలియాలి. కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా అగ్ని ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న జేసీ హరేంద్రప్రసాద్ వెంటనే వచ్చి రికార్డుల గదిని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో అక్కడున్న సిబ్బందిని ఆరా తీశారు. రికార్డులను వేరే గదిలోకి మార్చి భద్రత కల్పిస్తామని, సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. అగ్నిప్రమాదం ఘటనపై విచారణ జరిపిస్తామన్నారు.

## నెల్లూరును అభివృద్ధిలో...

# అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయేలా అనేకమైన అభివృద్ధి పనులు చేపట్టి నెల్లూరు నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పారు. ఈనెల 21న ఆయన నగరంలోని గుర్రాలమడుగు సంఘం, సిఆర్‌పి డొంక, ఉడ్‌హౌస్‌సంఘం తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి కాలువ ఆధునీకరణ పనులకు సంబంధించి అధికారులతో చర్చించారు. ఇక్కడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలువకు రెండుపక్కలా ప్రహరీ గోడను నిర్మిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటను తప్పకుండా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తున్నారని, తాము కూడా ఆయన బాటలో నడుస్తూ మాటకు కట్టుబడి ఉంటామని అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు తానెప్పుడూ రుణపడి ఉంటానన్నారు. దాదాపు నూరుకోట్ల రూపాయల వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, ప్రజలంతా అందుకు సహకరించాలని కోరారు. నగరంలోని రామలింగా పురం సెంటర్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణం రానున్న దసరాకల్లా పూర్తవుతుందన్నారు. పెన్నా బ్యారేజి వద్ద నాలుగు లైన్ల రోడ్డుతో పాటు, మైపాడు రోడ్డును విస్తరిస్తామన్నారు. ప్రజల కోసం తామెన్నో అభివృద్ధి పనులు చేస్తుంటే కొంతమంది తమపై లేనిపోని విమర్శలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు వేనాటి శ్రీకాంత్ రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, కొండా శివారెడ్డి, దొంతాలి రఘు, తుంగా ఇందూధర్‌రెడ్డి, మద్దినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐల బదిలీలు

జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఈనెల 22న ఉత్తర్వులిచ్చారు. వెంకటాచలంలో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను విఆర్‌కు, విఆర్‌లో ఉన్న ఎస్ కమలాకర్‌రావును వెంకటాచలంకు బదిలీ చేశారు. అదేవిధంగా కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న శివకృష్ణారెడ్డిని విఆర్‌కు, దిశ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న స్వప్నను కృష్ణపట్నంకు బదిలీ చేశారు. రాపూరులో పనిచేస్తున్న కెటిరెడ్డిని విఆర్‌కు, విఆర్‌లో ఉన్న క్రాంతికుమార్‌ను రాపూరుకు, సూళ్ళూరుపేట ఎస్ఐ శ్రీనివాసరావును విఆర్‌కు, సిసిఎస్‌లో పనిచేస్తున్న ఎం.ఉమా శంకర్‌ను సూళ్ళూరుపేటకు, గూడూరు ఒన్‌టౌన్‌లో పనిచేస్తున్న సైదులను విఆర్‌కు, విఆర్‌లో ఉన్న రోజాలతను గూడూరుకు, నాయుడుపేటలో ఉన్న వెంకటేశ్వరరావును విఆర్‌కు, సిసిఎస్‌లో ఉన్న కె.నాగరాజను నాయుడుపేటకు బదిలీ చేశారు.

## సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న

# తెలుగు కవిత్వం

**-సాహిత్య అకాడమి ఛైర్మెన్ కొలకలూరి ఇనాక్**

తెలుగు కవిత్వం కాలానుగుణంగా మారుతూ సమాజాన్ని ఎంతగనో చైతన్యవంతం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఛైర్మెన్ కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈనెల 22న ఆయన వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో కవులతో అంతర్జాల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు కవితా రూప పరిణామాన్ని విశ్లేషిస్తూ ప్రసంగించారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు అనుమాండ్ల భూమయ్య విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రాచీన కవితా వైశిష్ట్యాన్ని పద్యరూపంలో తెలియజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ సమన్వయకర్త, ప్రముఖ కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ మానవ మానసిక వికాసానికి కవిత్వ కళ తప్పనిసరి అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ ఛైర్మెన్ డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ కవి తాను నడిచివచ్చిన తోవను, తన గమ్యాన్ని నిర్ధేశించుకోవడానికి ఇలాంటి కవితా దినోత్సవ కార్యక్రమాలు ఎంతోగానో ఉపకరిస్తాయన్నారు. ప్రాచీన తెలుగువిశిష్ట అధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ డి.మనిరత్నంనాయుడు, దేశం నలుమూలల నుంచి 51 మంది ప్రసిద్ధ కవులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అంతర్జాల సదస్సుకు సాంకేతిక సమన్వయకర్తలుగా డాక్టర్ రమేష్, డాక్టర్ సతీష్, డాక్టర్ ఎస్ చంద్రయ్య వ్యవహరించారు.

# నెల్లూరు కబుర్లు

# సేవకు ప్రతిరూపం.. రెడ్‌క్రాస్

**- కలెక్టర్ చక్రధర్‌బాబు**

సేవకు ప్రతిరూపంగా నిలుస్తూ రెడ్‌క్రాస్ సంస్థ తన విశిష్టత చాటుకుంటోందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు కొనియాడారు. దేశంలో రెడ్‌క్రాస్ సేవలు ప్రారంభమై నూరు వసంతాలు గడిచిన సందర్భంగా నెల్లూరులోని విఆర్‌కాలేజీ మైదానంలో ఇటీవల ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అనే మదర్ థెరిస్సా బోధనలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాగుణం అలవరచుకోవాలన్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన తరుణంలో రెడ్‌క్రాస్



సంస్థ ప్రతినిధులు నెల్లూరులో చేపట్టిన సేవా కార్యక్రమాలు ఎంతో అభినంద నీయమైనవని, కరోనా రోగులకు వారందించిన సేవలు అపూర్వమని అన్నారు. ప్లాస్మా దానంలో దేశంలోనే నెల్లూరు ద్వితీయస్థానంలో ఉందని, ఇందులో రెడ్‌క్రాస్ సంస్థ ఎంతో కీలకమైన పాత్ర పోషించిందని అభినందించారు. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలు ఎంతో విశిష్టమైనవన్నారు. కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌లా వారు సేవలందించారని ప్రశంసించారు. తొలుత రెడ్‌క్రాస్ సంస్థ స్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి అందరూ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ ప్రతినిధులు చేపట్టిన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. జేసీ బాపిరెడ్డి, ఏసిఐఆర్‌సిఎస్ ఛైర్మెన్ ఎ.శ్రీధర్. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు అనేక మంది అధికారులు, రెడ్‌క్రాస్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రీయ సమాజం కోసమే..

# జనవిజ్ఞాన వేదిక



శాస్త్రీయ సమాజం కోసం జనవిజ్ఞానవేదిక కృషి చేస్తోందని జేవివి రాష్ట్ర నాయకుడు శంకరయ్య అన్నారు. ఈనెల 21న నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన జేవివి సర్వసభ్య సమాజంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జెవివిలో అందరూ భాగస్వాములు కావాలని, మూఢ నమ్మకాలను నిరసిస్తూ, సమాజంలో విజ్ఞానం పెంపొందిస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో జేవివి ముందుంటుందని అన్నారు. కరోనా సమయంలోనూ వలసకూలీలను సేవాభావంతో జేవివి ఆదుకున్నదన్నారు. ఈ సందర్భంగా జేవివి సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లను నిర్వహించి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జేవివి నాయకులు డాక్టర్ శ్రీనునాయక్, చలపతి, పూర్వప్రధాన కార్యదర్శి బుజ్జయ్య, విద్యాచరణ్, మాదాల రాము, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఉద్యోగులకు

# స్థానచలనం

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను పాలనా సౌలభ్యం కోసం అక్కడనే పలు విభాగాల్లోకి బదిలీచేస్తూ కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ ఈనెల 22న ఆదేశాలిచ్చారు. రెవెన్యూ విభాగంలోని కొన్ని సెక్షన్ల ఉద్యోగులను సిటీ ప్లానింగ్ విభాగానికి, సిటీప్లానింగ్‌లోని వారిని రెవెన్యూ విభాగంలోకి మార్చారు. కీలకస్థానాల్లో ఉన్నవారికి కూడా స్థానచలనం కలిగించారు.

## ఆంజనేయస్వామి గుడికి

# లక్షకు పైగానే రాబడి

నెల్లూరు సంతపేటలో ఉన్న ప్రసిద్ధమైన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ కానుకలను ఈనెల 22న ఆలయ అధికారులు లెక్కించారు. గత ఏడాది ఆగస్టు 13 నుంచి భక్తులు సమర్పించిన కానుకల రాబడి 1,07,956 రూపాయలు వచ్చిందని ఆలయ వర్గాలు తెలిపాయి. దేవాదాయ శాఖ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య ఈ లెక్కింపును పర్యవేక్షించారు. ఆలయ ఛైర్మెన్ గంధం సునీల్ కుమార్, ఇ.ఓ దుర్గయ్య, సభ్యులు నాగేంద్రప్రసాద్‌రెడ్డి, బాలకృష్ణ, లక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

## మాస్కు పెట్టుకో..

# లేదంటే వెయ్యి కట్టుకో



కరోనా మహమ్మారి మళ్ళీ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలంతా కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ముఖానికి మాస్క్ పెట్టుకోవాలని లేదంటే వెయ్యి రూపాయలు జరిమానా కట్టుకోవాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ స్పష్టం చేస్తున్నారు.. కోవిడ్ తగ్గిపోయిందనుకుంటూ నెల్లూరు నగరంలో అనేకమంది ప్రజలు విచ్చలవిడిగా గుంపులుగా తిరుగుతూ, అసలు కోవిడ్ నిబంధనలేమీ పట్టించుకోకపోతుండడంతో అధికారులు ఈ విషయమై దృష్టి సారించారు. మాస్కులు తప్పనిసరిగా ధరించాలని పదేపదే చెప్తున్నా వినని వారికి జరిమానాలు వేయడానికి సిద్ధమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో కోవిడ్ నిబంధనల అమలుపై అధికారులంతా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కరోనాతో జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, తరచూ చేతులను సబ్బుతోనో శానిటైజర్లతోనో శుభ్రం చేసుకుంటూ, భౌతికదూరం పాటిస్తూ ఉండాలని, తద్వారా కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు ప్రజలంతా సహకరించాలని వైద్యవర్గాలు కూడా కోరుతున్నాయి.

# సమాజ హితం కోరేదే.. సాహిత్యం

**-పెరసం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం-**



సమాజ హితం కోరేదే సాహిత్యమని, అందులోనూ మన తీయనైన తెలుగుభాష అభ్యున్నతికి అందరూ కృషిచేయాలని, తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించాలని ప్రముఖ సాహితీవేత్త, పెన్నా రచయితల సంఘం (పెరసం) గౌరవాధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ అన్నారు. అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరులోని కరెంటాఫీస్ సెంటర్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహిత్యానికి ఎల్లలు లేవని, సాహిత్యం సమాజాన్ని మంచివైపు నడిపిస్తుందని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్వేపల్లి రామమూర్తి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు అనేక సామాజికాంశాలను తమ కవితల ద్వారా వినిపించగా వారందరికీ పెరసం తరఫున ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కవి ఇంద్రగంటి మధుసూదన్‌రావు 'వేటూరి పాటల్లో అలంకారాలు' అనే అంశంపై ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. పెరసం అధ్యక్ష కార్యదర్శులు మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీధర్‌బాబు, నిర్వాహక కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, కోశాధికారి తోట సులోచన, కవులు ఇంద్రగంటి మధుసూదన్, లక్ష్మణరాజు, పల్లాపు రాము, కారుమంచి నాగేంద్ర, సోలా జానకి, మాటేటి రత్నప్రసాద్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ఇసనాక దయాకర్‌రెడ్డి, భాస్కర్, శేషమ్మ, విష్ణు, రవి, అంకబాబు, పేరిశెట్ల శివకుమార్, కృష్ణయ్య, కొండూరు వెంకటేశ్వరరాజు, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కవయిత్రికి

# కరీంనగర్‌లో సన్మానం



నెల్లూరు నగరానికి చెందిన కవయిత్రి వినీల కరీంనగర్‌లో సన్మానం అందుకున్నారు. కరీంనగర్‌లోని అనిల్‌కుమార్ లిటరరీ సంస్థ, లాంతరు సాహితీ సాంస్కృతిక సంస్థలు సంయుక్తంగా వినీలకు 'లాంతరు అవార్డు' బహుకరించి సత్కరించాయి. ఈనెల 22న కరీంనగర్‌లో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ చేతుల మీదుగా ఆమె ఆ అవార్డును అందుకున్నారు. సన్మాన కార్యక్రమంలో వినీల దంపతులతో పాటు నిర్వాహకులు అనిల్‌కుమార్, సంటి రూప పాల్గొన్నారు.

## బాలల రక్షణకు
# ఏ జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

### -పార్లమెంట్‌లో ఆదాల ప్రశ్న



బాలల రక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?... బాలల పట్ల లైంగిక దుర్వినియోగంపై దేశవ్యాప్తంగా ఎన్ని కేసులు నమోదయ్యాయి? అని నెల్లూరు ఎం.పి. ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల లోక్‌సభలో ప్రశ్నించారు. అందుకు కేంద్ర మహిళా, బాలల సంక్షేమ అభివృద్ధి శాఖామంత్రి స్మృతి ఇరానీ రాతపూర్వకంగా సమాధానం చెప్తూ.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం 2019లో 305 కేసులు నమోదయ్యాయని, బాలలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకుగాను 2019లో పోస్కో చట్టానికి కొన్ని సవరణలు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సైబర్ నేరాలనుంచి బాలలను రక్షించేందుకు అనేక చర్యలను చేపట్టిందని, లైంగిక చర్యలను సూచించే ఫోటోలు, సందేశాలు చేరవేసిన వారికి కఠినశిక్షలు అమలు కానున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సిబిఐ లాంటి సంస్థల నుంచి ఫిర్యాదు ఆధారంగా కొన్ని వెబ్‌సైట్‌లను నిషేధిస్తోందని, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌లకు హెచ్చరికలు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు జాతీయస్థాయిలో ఒక పోర్టల్‌ను అందుబాటులో ఉంచామని, సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక నిపుణులను నియమించామని తెలిపారు.

### నిర్బంధ సంతాన ప్రతిపాదన ఏదైనా ఉందా?

దేశంలో జనాభాని అరికట్టేందుకు ఇద్దరు బిడ్డల నిర్బంధ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురానుందా అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. జనాభాని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టనుందని కూడా ప్రశ్నించారు. కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ మంత్రి అశ్వనీకుమార్‌చౌటే దీనికి సమాధానం చెబుతూ అటువంటి ప్రతిపాదన లేదని రాతపూర్వకంగా తెలుపుతూ.. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో సంతానోత్పత్తి 2.7 నుంచి 2.2 తగ్గిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్బంధ సంతానోత్పత్తిపై విముఖంగా ఉందని స్పష్టం చేశారు. సంతానోత్పత్తిని నిర్ణయించుకునే హక్కు ఆయా వ్యక్తులకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. గర్భ నిరోధక మార్గాలకు అవసరమైన సేవలను మాత్రం అందిస్తోందని, కొన్ని వర్గాల వారికి గర్భ పరీక్షలు నిర్వహించుకునేందుకు ఆశావర్కర్ల వద్ద కిట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. మిషన్ పరివార్ వికాస్ జిల్లా కేంద్రాల్లో గర్భనిరోధక సేవలను అందిస్తోం దని పేర్కొన్నారు.

- అటు ఎండలు.. ఇటు కోవిడ్

## ఏప్రిల్ 1 నుంచి..
# ఒక్కపూట బడులు

రోజురోజుకీ పెరుగుతున్న ఎండలు ఒకవైపు, విజృంభిస్తున్న కోవిడ్ కేసులు ఒకవైపు.. దీంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు కొంత విరామం ఇస్తే బావుంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ 1వ తేది నుంచి మే 31వ తేది వరకు ఒక్కపూట బడులు నిర్వహించేందుకు సంకల్పించినట్లు మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. 1 నుంచి 10వ తరగతుల వరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే బడులు నిర్వహించనున్నామని తెలుపుతూ పాఠశాలల్లో కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా అమలయ్యేలా చూడాలని ఆయన ఉపాధ్యాయులను, అధికారులను కోరారు.

## రంగనాథస్వామి హుండీ
# ఆదాయం 4.60 లక్షలు

నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 20న హుండీ లెక్కింపు జరిగింది. ఈ ఏడాది జనవరి 21 నుంచి మార్చి 20వ తేది వరకు 59 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా 4,60,891 రూపాయలు వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఆలయ ఇఓ డి.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ బ్యాంకు సిబ్బంది, అర్చకులు, ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

# శ్రీసిటీ ప్రగతి భేష్

### సమాచార కమిషనర్ బివిరమణకుమార్




రాష్ట్ర సమాచార కమిషనర్ బివి రమణకుమార్ ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. గతంలో గూడూరు డిఎస్పీగా, నెల్లూరుజిల్లా ఎస్పీగా పనిచేసిన రమణకుమార్ అప్పట్లో కూడా పలుమార్లు శ్రీసిటీని సందర్శించారని, శ్రీసిటీలో శాంతిభద్రతల మెరుగుదలకు ఎంతో విలువైన సూచనలు సలహాలు ఇచ్చారని రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. శ్రీసిటీ వాతావరణం, వ్యాపారానుకూల పరిస్థితులు అన్నీ బావున్నాయంటూ రమణకుమార్ శ్రీసిటీ ప్రగతిని మెచ్చుకున్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతున్న.. శ్రీసిటీ



విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు శ్రీసిటీ ఎంతగానో కృషిచేస్తోంది. శ్రీసిటీ పరిసర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు గత ఏడెనిమిది సంవత్సరాలుగా శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులలో జ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు మొబైల్ సైన్స్ ల్యాబ్ కార్యక్రమానికి శ్రీసిటీ ఫౌండేషన్ చొరవచూపింది. సోమ, మంగళవారాలు రెండు రోజులు జరిగిన ఈ కార్యక్రమం ద్వారా ఇరుగుళం, మాదనపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్ల విద్యార్థులకు వివిధ పరికరాలు, బొమ్మలు వినియోగించి చేతి కృత్యాల ద్వారా ప్రత్యేక క్లాసులు నిర్వహించి వివిధ పాఠ్యాంశాలలో అవగాహన కల్పించారు. కుప్పం కేంద్రంగా పనిచేస్తున్న అగస్త్యా ఫౌండేషన్ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని శ్రీసిటీ సెజ్ డెవలప్‌మెంట్ కార్యాలయం అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ సత్యనారాయణ ప్రారంభించారు.

మొబైల్ సైన్స్ ల్యాబ్‌లో వచ్చిన ప్రత్యేక అధ్యాపక బృందం ల్యాబ్ పరికరాలను వినియోగించి బయాలజీ, మ్యాథమేటిక్స్, ఆర్ట్స్ సబ్జెక్టులలో 8,9,10 తరగతుల విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలలో అవగాహన తరగతులు నిర్వహించారు. ఇరుగుళంలో 163 మంది విద్యార్థులు, మాదనపాలెంలో 90 మంది ఈ క్లాసులకు హాజరై అవగాహన పొందారు. మొబైల్ సైన్స్ ల్యాబ్ తరగతుల పట్ల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ, వినూత్న కార్యక్రమాలతో ప్రోత్సాహం అందిస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్ చొరవకు కృతజ్ఞతలు తెలిపారు.

దీనిపై శ్రీసిటీ మేనేజింగ్ డైరక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని పెంచే ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం తమకు సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్, శ్రీసిటీ సెక్యూరిటీ హెడ్ రమేష్, తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోరేం?..

### - మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ

జిల్లాలో రైతుల సమస్య మళ్ళీ మొదటికొచ్చిందని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు అన్యాయం జరుగుతున్నా మంత్రులు ఎమ్మెల్యేలు అధికారులు ఏం చేస్తున్నారని మాజీమంత్రి, టిడిపి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడి విమర్శించారు.

ఈనెల 23న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో జిల్లా రైతు విభాగం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి పంట కోతలు మొదలై పంట చేతికందే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, 1010 రకం ధాన్యాన్ని గత ఇరవై ఏళ్ళుగా ఎఫ్‌సిఐ సేకరిస్తున్నా, ఇప్పుడు దాంతోపాటు సివిల్ సప్లయిస్ శాఖ కూడా ఆ రకం ధాన్యం కొనుగోలుకు ముందుకు రాకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నాణ్యమైన ఈ రకం ధాన్యాన్ని ఎందుకు తీసుకోవడం లేదో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ పంట బాగా ఉంటుందని భావిస్తే దానిని రైతులు వేసుకుంటారని, అయితే ఆ పంట ఎందుకు వేశారని అడగడంలో అర్థం లేదని అన్నారు. బిపిటితో పాటు మిగిలిన రకాల ధాన్యాన్ని కూడా పుట్టికి 1030 నుంచి 1060 కిలోల వరకు తీసుకుంటున్నారని, ధాన్యాన్ని బాగా ఎండబెట్టి తీసుకుపోయినప్పటికీ బియ్యం రావడం లేదని నూకలు వస్తున్నాయని సాకులు చెప్తున్నారని ఆయన తెలిపారు. రెండో పంట సమయంలో వర్షాలు కురిశాయని, నెమ్ము శాతం ఎక్కువగా ఉందంటూ 300 నుంచి 400 కిలోల దాకా తీసుకున్నారని, ఇప్పుడు మళ్ళీ మొదటి పంటలోనూ 170 కిలోలు ఎక్కువ తీసుకుంటూ రైతులకు అన్యాయం చేయడం దారుణమని అన్నారు. అసలే పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గిపోయి రైతులు నానా అవస్తలు పడుతుంటే, రైతులకు ఇంత అన్యాయం చేయడం ఏమిటని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పరిస్థితులను చక్కదిద్ది రైతులకు న్యాయం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగు రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మద్రెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు రావూరి రాధాకృష్ణమనాయుడు, నాయకులు జలదంకి శ్రీహరి



నాయుడు, మాలేపాటి సుబ్బానాయుడు, ఈపూరు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి, టంగుటూరు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీటి వనరులను జాగ్రత్త చేసుకోవాలి

### - ప్రపంచ నీటి దినోత్సవంలో ఇంజనీర్ల హితవు

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఈనెల 22న ఆంధ్రప్రదేశ్ ఇంజనీర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్ కె.విజయబాబు ఆధ్వర్యంలో వెబ్‌నార్ నిర్వహించారు. ప్రధాన వక్తలుగా విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఐఎస్‌ఎన్ రాజు, మదనపల్లి చీఫ్ ఇంజనీర్ రాజభూషణం పాల్గొని నీటి విలువను గ్రహించి, పొదుపుగా వాడుకుంటూ నీటి వృధాను అరికట్టాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది నీటిపారుదల, ఆర్‌అండ్‌బి, పబ్లిక్ హెల్త్, పంచాయతి, మునిసిపల్ శాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# గూడూరు డివిజన్ వార్తలు

## వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

**- మునిసిపల్ కమిషనర్ ఓబులేసు**



రోజూ వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ ఓబులేసు అన్నారు. గూడూరు సీఎస్ఎం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వ్యాయామశాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని రెండు ఉద్యానవనాలు, వ్యాయామశాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## పనబాకను గెలిపించుకుందాం

**- మాజీఎమ్మెల్యే పాశం సునీల్**



తిరుపతి ఉపఎన్నికలలో పనబాక లక్ష్మిని గెలిపించుకుందామంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు గూడూరు మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్. ఈ నెల 21వ తేదీ గూడూరు - చిల్లకూరు బైపాస్‌లోని ఏ5 కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన టిడిపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనమంతా అవిశ్రాంతంగా పోరాడి పనబాకను గెలిపించుకోవాలన్నారు. మాజీ మంత్రులు సామిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్,తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్కిరాల ఉష, ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## ఇందుకూరుపేటకు లీలారాణి



జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గూడూరు తహశీల్దార్ బి.లీలారాణి ఇందుకూరుపేటకు బదిలీ అయ్యారు. రెండు సంవత్సరాల క్రితం గూడూరు తహశీల్దార్‌గా విధుల్లోకి వచ్చిన లీలారాణి విధుల్లో ఎక్కడా రాజీ లేకుండా ముక్కుసూటిగా వ్యవహరించేవారని పేరుంది. పైరవీలకు, ప్రలోభాలకు, రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తుల పరం కాకుండా చేయడం లీలారాణి సమర్ధతకు అద్దం పడుతుందని, ఇలాంటి ముక్కుసూటి అధికారి బదిలీ పట్ల గూడూరు మండల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

**- ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.రమణయ్య పిలుపు**



గూడూరు న్యాయస్థానం ఆవరణలో ఏప్రిల్ 10న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలని ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.రమణయ్య పిలుపునిచ్చారు. గూడూరు న్యాయస్థాన ప్రాంగణంలో పోలీసులు, న్యాయవాదులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. న్యాయమూర్తులు జానీబాషా, అశోక్‌కుమార్, గాయత్రి, న్యాయ వాదులు, పోలీసులు, న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేస్తాం



**- మత్స్యకారులతో ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి**

సర్వేపల్లి నియోజకవర్గంలో మత్స్యకారుల కోసం ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ముత్తుకూరు మండలంలోని తాళ్ళపూడి గ్రామంలో ఈనెల 23న నిర్వహించిన మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు చేపట్టారని తెలిపారు. మత్స్యకార భరోసా పేరుతో మత్స్యకారుల కుటుంబాలకు 10వేల రూపాయలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో డీజిల్ సబ్సిడీ పేరుతో మత్స్యకారులను మోసం చేశారని, అయితే తమ ప్రభుత్వం లీటర్‌కు 9 రూపాయల సబ్సిడీని అన్ని మరబోట్ల మత్స్యకారులకు అందజేస్తోందని వివరించారు. వైకాపా నాయకులు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, మత్స్యకార గ్రామాల కాపులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం.. సిఎం జగన్ ధ్యేయం

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టి అమలుచేస్తున్నారని వైకాపా తిరుపతి, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న వాకాడులోని ఆయన నివాసంలో పలువురు రైతులు కలిసి తమ సమస్యలను విన్నవించగా అధికారులతో సంప్రదించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నిక విషయమై ఆయన కోట, చిట్టమూరు, వాకాడు, చిల్లకూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి చర్చించారు.

## 'క్షయ' రహితంగా.. జిల్లాను తీర్చిదిద్దాలి

**- జేసీ ప్రభాకర్‌రెడ్డి**

జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులకు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 23న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తన చాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు జిల్లాలో చికిత్సలు, క్షయవ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అన్నీ ఉన్నాయన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వారికి దగ్గరలోనే ఉన్న సచివాలయాల్లో ఏఎన్ఎంల దృష్టికి తీసుకురావాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్సలు పొందాలని సూచించారు.

## మహమ్మారి నియంత్రణకు సహకరించండి

**డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ అచ్యుతకుమారి**



కరోనా మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, నియంత్రణకు సహకరించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ అచ్యుత కుమారి అన్నారు. గూడూరులోని ప్రాంతీయ ఆసుపత్రిలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, జిల్లాలోనూ కేసులు క్రమంగా పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు.

## సెక్టార్ 2 ఎస్సైగా రోజాలత



గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ సెక్టార్-2 ఎస్సైగా ఈ నెల 23వ తేదీ కె.రోజాలతా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉన్న వేటూరి బ్రహ్మనాయుడు ఒకటో పట్టణ ఎస్.హెచ్.ఓగా బాధ్యతలు చేపట్టారు.



ఈ నెల 23వ తేదీ మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా గూడూరులోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైసీపీ నేత మల్లు సురేష్‌బాబు, అధ్యక్షులు గుండాల ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న అనిల్ అభిమానులు, వైసిపి కార్యకర్తలు తదితరులు.

## విస్తృతంగా రోటరీ సేవలు



రోటరీ జిల్లా 3160 గవర్నరు చిన్నప్పరెడ్డి అధికారిక పర్యటనలో భాగంగా గూడూరు మెయిన్ క్లబ్బును సందర్శించడం జరిగింది. ఇందులో భాగంగా రోటరీ మెయిన్ క్లబ్ వారు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత పట్టణంలో వీధి వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారులకు ఎండా, వానల నుండి రక్షణ పొందేందుకు 80 గొడుగులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మునిసిపల్ కమిషనర్ ఓబులేసు పాల్గొన్నారు. అనంతరం గవర్నర్ రోటరీ సభ్యులతో సమావేశమై వారు చేస్తున్న వివిధ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకొని తన సంతృప్తిని వ్యక్తం చేశారు.

# బిలకూట క్షేత్రానికి.. బ్రహ్మోత్సవ శోభ

***జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోగోలు మండలం కొండ బిట్రగుంటలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేలసంఖ్యలో భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలివస్తుండడంతో కొండంతా గోవింద నామస్మరణలతో మార్మోగిపోతోంది. ఎక్కడ చూసినా భక్తజనసందోహంతో క్రిక్కిరిసిపోతోంది. విద్యుత్ దీపాలంకరణలు, భారీ విద్యుత్‌దీపాల కటౌట్లతో ఆలయ సముదాయమంతా దేదీప్యమానంగా వెలిగిపోతోంది.***

- భక్తజన సంద్రంగా కొండ బిట్రగుంట
- మార్చి 26న గరుడసేవ
- 27న తెప్పోత్సవం.. ♦ 28న రథోత్సవం

## నారద మహర్షి తపమాచరించిన చోటు :

కష్టాలు తీర్చి భక్తులు కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా ప్రసిద్ధి చెందిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవిర్భావం గురించి పురాణ కథనాలు కూడా ఉన్నాయి. నారద మహర్షి కోరిక మేరకు శ్రీ మహావిష్ణువు ఇక్కడ ప్రసన్న వేంకటేశ్వరుని రూపంలో అవతరించాడని, నారదుడు ప్రతిష్టించిన ఆ విష్ణురూపానికి ఈ బ్రహ్మోత్సవాల సమయంలో సప్తరుషులు కూడా అదృశ్యరూపంలో వచ్చి పూజలు చేస్తుంటారని ప్రతీతి. నారద మహర్షి తపమాచరించిన పవిత్రమైన క్షేత్రం కనుక ఇది బిలకూట క్షేత్రంగా, శ్రీ వేంకటేశ్వరుని దివ్య సన్నిధానంగా ప్రసిద్ధిచెందింది. స్వామివారిని ఈ బ్రహ్మోత్సవాల రోజుల్లో దర్శించుకోవడం కోసం జిల్లాలోని వారే కాక, రాష్ట్రవ్యాప్తంగా ఎంతెంతో దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు.



## విశిష్ట అలంకారాలు..విశేష పూజలు :

స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండ బిట్రగుంట విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున చర్యలు తీసుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి నిత్యం విశిష్టమైన అలంకారాలు నిర్వహించి, విశిష్ట పూజలు చేస్తున్నారు. మార్చి 23వ తేది నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో కొండ బిట్రగుంటకు వేలాదిగా భక్తులు వస్తున్నారు. కొండచుట్టూ భక్తులు ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకునే 'గిరి ప్రదక్షిణ' కార్యక్రమం, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా చేసే అంకురార్పణ పూజలతో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 24వ తేదీన ధ్వజారోహణ జరిగింది. ఈ సందర్భంగా భక్తులందరూ సకల శుభాలు చేకూర్చే స్వామివారి కొడిముద్దల ప్రసాదం స్వీకరించేందుకు పోటీలు పడ్డారు. అదే రోజున స్వామివారికి కన్నుల పండువగా శేషవాహనోత్సవం జరిగింది.

25వ తేది గురువారం జరిగిన హనుమంత సేవ ఉత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా, 26వ తేది ఉదయం మోహినీ ఉత్సవం, రాత్రికి నేత్ర పర్వంగా గరుడసేవ నిర్వహించనున్నారు. 27వ తేది మొక్కుబడులు కార్యక్రమం, అనంతరం సాయంత్రం వైభవోపేతంగా తెప్పోత్సవం జరుగుతుంది. 28వ తేది ఆదివారం ఉదయం స్వామి వారికి కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించనున్నారు. అనంతరం జరిగే రథోత్సవంలో భక్తులు మరింత పెద్దసంఖ్యలో పాల్గొననున్నారు. 29వ తేది సాయంత్రం పుష్పయాగం, పూలంగిసేవ అద్వితీయంగా నిర్వహించనున్నారు. ఆ తర్వాత రాత్రి ఏకాంతసేవతో ఈ బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఈ సందర్భంగా ప్రతిరోజూ ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులందరినీ బాగా ఆకట్టుకుంటున్నాయి. ఆర్డీఓ జి.శ్రీనివాసులు, ఆలయ ఇ.ఓ రాధాకృష్ణ, ఆలయ కమిటీ ఛైర్మెన్ శ్రీరాం మాల్యాద్రి తదితరుల పర్యవేక్షణలో అన్నిశాఖల అధికారులు బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి తదితర నాయకులంతా పాల్గొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. ఈసారి ప్రత్యేకంగా చక్రస్నానం ఉత్సవం కూడా నిర్వహిస్తుండడంతో కోనేరు వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కరోనా నేపథ్యంలో భక్తులంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ నిర్వాహకులు, అధికారులు స్పష్టం చేశారు.

# క్రీడల్లో యువత.. బాగా రాణించాలి

**– ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



యువత విద్యతో పాటు క్రీడల్లోనూ బాగా రాణించాలని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. ఈనెల 21న నాయుడుపేటలో కిలివేటి సంజీవయ్య యువసేన ఆధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లాల ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్స్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పోటీల్లో గెలుపు ఓటములు ప్రధానం కాదని, క్రీడాస్ఫూర్తి ఎంతో ముఖ్యమని, క్రీడాకారులంతా ప్రతిభతో రాణిస్తూ అంతర్జాతీయస్థాయి ఖ్యాతినార్జించాలని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం లభిస్తుందని, క్రీడలను ప్రోత్సహించేందుకు అనేకమంది దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. క్రీడాకారులను మరింతగా ప్రోత్షహించేందుకు క్రీడా మైదానాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కిలివేటి సంజీవయ్య యువసేన, అగ్రహారపేట యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ ఛైర్మెన్ రఫీ, నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కొండూరు రామకృష్ణమరాజు, చదలవాడ కుమార్, కటకం జయరామయ్య, గంధవళ్ళి సిద్ధయ్య, పేర్నాటి రాహుల్, చెంచయ్య, కరీంబాయి తదితరులు పాల్గొన్నారు.

# పెంచలస్వామి సేవలో సతీష్‌రెడ్డి సతీమణి



డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి సతీమణి, వారి కుటుంబసభ్యులతో కలసి ఈనెల 21న ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామిని, ఆదిలక్ష్మీదేవి–చెంచులక్ష్మీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య సాదర స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు వారికి శ్రీవారి ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

# భక్తులకు వరం.. నెల్లూరు 'అయ్యప్పస్వామి ఆలయం'

***కోరిన కోర్కెలు తీర్చే స్వామి, కష్టాలను కడతేర్చి సకల శుభాలను చేకూర్చే అభయప్రదాత శబరిమలైలో వెలసివున్న శ్రీ అయ్యప్పస్వామి అన్నది భక్తులందరికీ బాగా తెలిసిన విషయమే. అయ్యప్ప స్వామిపై అపారమైన భక్తితో నెల్లూరు దర్గామిట్టలో ఇటీవలికాలంలో నెలకొల్పిన అయ్యప్పస్వామి దేవాలయం కూడా అనేక ప్రాంతాల భక్తులకు కొంగు బంగారంగా అభివృద్ధి చెందుతోంది. నిత్యం పెద్ద సంఖ్యలో భక్తుల రాకపోకలతో..అయ్యప్పస్వామి పూజలు సేవలతో, కాల క్రమేణా ఈ ఆలయం.. రెండవ శబరిమలై అన్నట్లుగా భక్తుల పూజలందుకుంటోంది.***

'స్వామియే..శరణం అయ్యప్పా' అంటూ..'శరణం శరణం మా స్వామీ..శ్రీ అయ్యప్పస్వామీ'..అంటూ ప్రతిఏటా కార్తీక మాసంలో వేలాదిమంది భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలను ధరించి, అయ్యప్పస్వామి నామజపంతో కఠోర దీక్షతో పూజలు చేస్తూ ఇరుముడులు కట్టుకుని శబరిమలైకి వెళ్తుంటారు. హరిహరసుతుడైన అయ్యప్పస్వామిని కళ్ళారా దర్శించుకుంటుంటారు. జీవితంలో ఒక్కసారైనా ఆ స్వామిని దర్శించుకుంటే చాలు.. ఈ జన్మకు అంతకన్నా భాగ్యం ఏమిటని భక్తులంతా భావిస్తారు. అయ్యప్పస్వామిని కొలుచుకోవడమే కాదు.. తలచుకున్నా చాలు కష్టాలన్నీ తొలగిపోతాయి. అంతటి మహిమాన్వితమైన స్వామికి గుడి కట్టి పూజించాలన్న అయ్యప్పస్వామి భక్తుల సంకల్పానికి..ఆ స్వామి దివ్యాశీస్సులు తోడై.. ఒక అద్వితీయమైన ఆలయం నిర్మాణం కావడం ఒక అద్భుతం. అదే నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం. ఈ ఆలయ నిర్మాణంతో.. ఈ కూడలి కూడా స్వామివారి పేరుతోనే 'అయ్యప్పగుడి సెంటర్'గా మారి అందరికీ సుపరిచితమైంది.







మన దేవాలయాలు 40

## ఆలయ ఆవిర్భావం :

మొదట్లో నెల్లూరులో ఉన్న కేరళీయులు కొంతమంది అయ్యప్పస్వామి మీద అపారమైన భక్తితో పూజలు, సేవలు చేసేవారు. క్రమేణా నెల్లూరులో కూడా అయ్యప్పస్వామికి ఆలయం ఉంటే నిత్యపూజలకు బావుంటుందనే ఆలోచనతో వారితో పాటు నగరంలోని పలువురు దాతలు, భక్తులందరు కలసి 'అయ్యప్పస్వామి సేవా సమాజాన్ని' స్థాపించి ఆలయ స్థాపనకు కృషి ప్రారంభించారు. ఎట్టకేలకు అందరి కృషి ఫలించి, ఆ స్వామి కృప కలిగి 1982లో శృంగేరి పీఠాధిపతి అమృతహస్తాలతో నెల్లూరు నగరశివార్లలో ఉన్న వేదాయపాళెంలో శ్రీ అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఆ తర్వాత 1987లో కేరళకు చెందిన అయ్యప్పస్వామి భక్తుడు, అర్చకుడు వడకేడత్తు పెరుంబడప్ప కేశవన్ నంబూద్రిపాద్ తంత్రి నేతృత్వంలో, అయ్యప్పస్వామి సేవాసమాజం ఆధ్వర్యంలో అద్వితీయమైన రీతిలో శ్రీ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు జరిగాయి. నెల్లూరుకు చెందిన ఎందరో దాతలు, భక్తుల సహకారంతో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. నాటినుంచి నేటికీ ఆలయంలో అయ్యప్పస్వామికి నిత్యపూజలు, సేవలు జరుగుతూనే ఉన్నాయి. నెల్లూరుజిల్లాలోని అయ్యప్పస్వామి భక్తులకు ఈ ఆలయం ఒక అపురూపమైన వరంగా మారింది. అయ్యప్ప స్వామిని నిరంతరం పూజించే ఎందరో గురుస్వాముల ఆశీస్సులు, సహకారాలతో ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఏడాదికేడాది గణనీయంగా పెరుగుతూనే ఉంది.

## కేరళ సంప్రదాయరీతుల్లోనే పూజలు :

అయ్యప్పస్వామి గుడిలో కేరళ సంప్రదాయరీతుల్లోనే స్వామి వారికి పూజలు, అభిషేకసేవలు, ఉత్సవాలు, మహా దీపారాధనలు.. అన్నీ కన్నులపండువగా జరుగుతుండడం విశేషం. ఆలయ గర్భగుడిలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీ అయ్యప్పస్వామి దర్శనం.. సకల పాప విమోచకమే కాక, సర్వశోక వినాశకం కూడా. ఆలయంలో శిలారూపంలో ఉన్న శివలింగం, విఘ్నేశ్వర దేవతా ప్రతిమలు, సుబ్రహ్మణ్యస్వామి గుడి, నవగ్రహమండపంతో పాటు ఆలయ మండపంలో ఎంతో శిల్పకళానైపుణ్యంతో రూపొందించిన దశావతారమూర్తుల ప్రతిమలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆలయంలో ప్రవేశించగానే భక్తుల మనసుల్లో భక్తిభావ పరంపరలు వెల్లువెత్తుతాయి.

ఆలయప్రాంగణంలో కొంతకాలం క్రితం గురువాయూర్ శ్రీకృష్ణస్వామి దేవాలయాన్ని కూడా అత్యద్భుతమైన రీతిలో నిర్మించారు. శ్రీ అయ్యప్పస్వామితో పాటు అనేక దేవతామూర్తుల ప్రతిమలతో..దేవతల నిలయంగా భాసిస్తూన్న ఈ ఆలయం నిరంతరం ఆధ్యాత్మిక భక్తిభావాలను పెంపొందింపజేస్తూ భక్తులందరినీ అనుగ్రహిస్తూ.. తరింపజేస్తూ ఉంది.

# అనగనగా.. ఒక కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

## ఆంధ్రాలో ఒకేసారిగా కనుమరుగు...

2014లో ఆంధ్రాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో, ఇతర పార్టీల గెలుపోటములను పక్కన పెడితే కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా కనుమరుగైపోయింది. తెలుగుదేశం, వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలనే ప్రజలు ప్రధాన పార్టీలుగా గుర్తించారు తప్ప కాంగ్రెస్‌పార్టీ అనేది ఒకటుందని కూడా ఆలోచించలేదు. ఇక 2019లో జరిగిన సాధారణ ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల పోరులో కూడా ఓటర్లకు గుర్తులేనంతగా ఆ పార్టీ భూస్థాపితమైపోయింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని తగ్గించాలనే ఆలోచనతో రాష్ట్రాన్ని విడగొట్టి లాభపడాలనుకున్న కాంగ్రెస్ అదే జగన్‌మోహన్‌రెడ్డి దెబ్బకు అటు తెలంగాణలోను ఇటు ఆంధ్రాలోను కుప్పకూలిపోయింది. ఎన్నికల ఫలితాలు వస్తున్న తరుణంలో టి.వి చానళ్లు సైతం వై.సి.పి., టి.డి.పి., బి.జె.పి., జనసేన పార్టీలనే ప్రధానపార్టీలుగా గుర్తించారు తప్ప కాంగ్రెస్‌ను ఇతరులలో కలిపేశారు.

## తెలంగాణలో అంచెలంచెలుగా అంతర్ధానం...

తెలంగాణ వాసులకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి ఓట్లు పొందాలన్న కాంగ్రెస్ పాచిక అక్కడ కూడా పారలేదు. తెలంగాణ కోసం పోరాడి ప్రత్యేక రాష్ట్రం సాధించిన వీరుడిగా అక్కడ ప్రజలు కే.సి.ఆర్.ని ఆదరించారుతప్ప తమకు తెలంగాణా ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీకి కృతజ్ఞత చూపించలేదు. ఇప్పుడు తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీకి వైఎస్ కుటుంబంతోనే నష్టం జరిగే సూచనలు కనిపిస్తున్నాయంటున్నాయి రాజకీయ వర్గాలు. వైయస్ కూతురు షర్మిలమ్మ తెలంగాణ కోడలిగా నన్ను ఆదరించండి అంటూ చేస్తున్న విజ్ఞప్తి కాంగ్రెస్ వర్గాలని ఎక్కువగా ఆకర్షిస్తుందన్నది వారి వాదన. ఇదే జరిగితే రాజశేఖరరెడ్డి కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒక్కొక్కరుగా షర్మిల గూటికి చేరి ఆమె పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తారని విశ్లేషకుల అంచనా. ఆ రాష్ట్రంలో ఇప్పటికే కొన ఊపిరితో ఉన్న కాంగ్రెస్‌పార్టీ అక్కడ కూడా పూర్తిగా అంతర్ధానమైపోతుందని రాజకీయ మేధావుల అంచనా.

ఎంతోమంది రాజకీయ నాయకులను యోధానుయోధులుగా తీర్చిదిద్దిన 135 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ, స్వాతంత్ర్యోద్యమంలో దేశం కోసం త్యాగాలు చేసిన పార్టీ, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని కొన్ని దశాబ్దాల పాటు శాసించిన పార్టీ... ఇప్పుడు ఆంధ్రాలో ఆనవాళ్లు కూడా లేకుండా పోయింది. అనగనగా ఒక కాంగ్రెస్... అంటూ భవిష్యత్ తరాలకు ఒక కథగా చెప్పుకునే స్థాయికి పడిపోయింది.

### జె.ఇ.ఇ మెయిన్స్‌లో

# కృష్ణచైతన్య విజయకేతనం



ఇటీవల జరిగిన జె.ఇ.ఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరుకు చెందిన కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అభిషేక్ జాతీయ స్థాయిలో 99.22 పర్సంటైల్‌ను సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. హర్షవర్ధన్ 98.3, సుమశ్రీ 98.2, ఆశ్రిత్ వర్మ 97.9, పవన్‌సాయి 97.3, మన్‌జీత్‌రెడ్డి 96.8 పర్సంటైల్స్ సాధించి అందరి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా వీరిని కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ ఆర్.వి.కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు అభినందించారు. డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ ఉమ పాల్గొన్నారు.

### కాలధర్మం

## రావి వసుమతి



ఈదూరు గ్రామ వాస్తవ్యురాలు రావి వసుమతమ్మ, తమ 82వ యేట, మార్చి19వతేదీ, శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆమె భర్త స్వర్గీయ శ్రీనివాసులనాయుడు ఈదూరు గ్రామంలో పేరు మోసిన రైతు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు విజయలక్ష్మి, అరుణ, సత్య ఉన్నారు. వసుమతమ్మ మనుమలు, మనుమరాళ్లందరూ ఉన్నత చదువులు చదివి విదేశాలలో స్థిరపడిపోయారు. ఆమె గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో ఉన్నప్పటికి ఇస్కాన్ ఆదర్శాల పట్ల ఆకర్షితురాలై భక్తురాలిగా మారారు. అజాతశత్రువుగా, మితభాషిగా అందరితో ఆత్మీయంగా ఉండే వసుమతమ్మ అంటే ఆమె బంధుమిత్రు లందరికీ అమిత ఇష్టమే కాదు గౌరవం కూడా. ఆమె గత కొంతకాలంగా తమ పెద్ద కుమార్తె విజయలక్ష్మి వద్దే తన స్వగ్రామం ఈదూరులోనే ఉంటున్నారు. అనారోగ్యంగా ఉంటూ శుక్రవారం కన్నుమూశారు. నంబూరు లాబొరేటరీస్ వ్యవస్థాపకులు నంబూరు మోహనరావుకి వసుమతి సొంత అక్క. ఆమె ఆత్మశాంతికై ప్రార్థిస్తూ, వసుమతమ్మ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# 'ప్రత్యేక హోదా' రాజకీయం

'ప్రత్యేక హోదా' కేంద్ర బిందువుగా రాష్ట్ర రాజకీయం వేడెక్కే సూచనలు కనపడుతున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం తాజాగా పార్లమెంట్‌లో ప్రకటించడమే ఇందుకు కారణం.

నిజానికి, సారవంతమైన కోస్తా ఆంధ్ర ప్రాంత ప్రజలకు అసలు 'ప్రత్యేకహోదా' అంటే ఏమిటో..., దానివల్ల ప్రయోజనాలు ఏమిటో తెలియదు. విభజన చట్టం తెరమీదకు వచ్చే వరకు అసలు ఆ పదం కూడా చాలామంది విని ఉండరు. దున్నపోతు ఈనిందంటే.. దొడ్లో కట్టేయమన్న తెలుగు సామెత టైపు ఈ స్పెషల్ స్టేటస్ కిటుకు.

తెలంగాణ నుంచి ఆంధ్రను తన్ని తరిమేసే హడావుడిలో (తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని తెలంగాణ వాదులు డిమాండ్ చేస్తే, కేంద్రం మాత్రం ఆంధ్ర వారికి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది) ఆంధ్ర నాయకుల చేతిలో అప్పటి పాలకులు పెట్టిన 'బెల్లం' ముక్క ఈ స్పెషల్ స్టేటస్ పాచిక.

నిజానికి ఇది మన రాష్ట్రానికి వర్తించదు. మన దేశానికి ఇతర దేశాలతో ఉన్న సరిహద్దు రాష్ట్రాలు, కొండ ప్రాంతాలు అత్యధికంగా కలిగి స్వంతంగా అభివృద్ధి చెందలేని రాష్ట్రాలు, గిరిజన జనాభా అత్యధికంగా కలిగి బాగా వెనుకబాటుతనానికి లోనై ఉన్న రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేకంగా కొన్ని రాయితీలు, వనరులు మొదలైనవి ఉద్దేశించాలని 5వ పంచవర్ష ప్రణాళిక ఉపాధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ గాడ్గిల్ ముఖర్జీ 1969లో ప్రతిపాదించారు. దీనినే గాడ్గిల్ ప్లాన్ అని కూడా పిలిచేవారు. ఈ షరతులలో ఏ ఒక్కటీ మన రాష్ట్రానికి వర్తించదు. ఇతర దేశాలతో మనకు సరిహద్దులు లేవు. కొండప్రాంతాల మధ్యలో మన రాష్ట్రం లాక్ అయ్యిలేదు. గిరిజనుల మెజారిటీ కలిగిన రాష్ట్రం అసలు కాదు. అందుకనే, ఈ పథకం మనకు వచ్చే అవకాశం లేదు.



కొంచెం వెనక్కు వెళితే...

ఈ పథకం కింద అస్సాం, నాగాలాండ్, జమ్ము & కశ్మీర్‌ను 1969లో తొలుత ఎంపిక చేశారు. 1974 నుంచి మరో 5 రాష్ట్రాలకు ఈ స్పెషల్ స్టేటస్‌ను వర్తింప చేశారు. అవి హిమచలప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, సిక్కిం, త్రిపుర. ఇవన్నీ ఈశాన్య రాష్ట్రాలు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కరే ఎం.పి. 1990లో అరుణాచలప్రదేశ్‌ను, 2001లో ఉత్తరాఖండ్‌ను ఈ జాబితాకు కలపడంతో మూడిటితో మొదలైన జాబితా 10కి చేరింది.




2013లో తెలంగాణ నుంచి ఆంధ్రను విడదీసే సమయంలో 'స్పెషల్ స్టేటస్' అనే మాయ వలను ఆంధ్ర నాయకులపై కేంద్రం విసిరింది. దీంతో కిక్కురుమనకుండా విభజనకు ఒప్పేసుకున్నారు.

ఇదీ ఈ స్పెషల్ స్టేటస్ పూర్వరంగం.

2013లో హామీ ఇచ్చిన వారు 2014 ఎన్నికల్లో శంకరగిరి మాన్యాలు పట్టి పోయారు. క్రీస్తు శకం... శాలివాహన శకం లాగా నరేంద్ర మోడీ శకం ప్రారంభమైంది.

ప్లానింగ్ కమిషన్ రద్దు చేశారు. 14వ పంచవర్ష ప్రణాళిక బోర్డ్ 10 రాష్ట్రాలకు ఇచ్చే స్పెషల్ స్టేటస్‌ను రద్దు చేయమని సిఫారసు చేసి, తనువు చాలించింది. దాని స్థానంలో నీతీ ఆయోగ్ అనే ఓ కొత్త వ్యవస్థ వచ్చింది. 14వ ప్రణాళికా సంఘం ఇచ్చిన సిఫారసును కేంద్రం 2015లో ఆమోదించింది.

నిజానికి 'విభజన కుట్ర'ల వల్ల ఆంధ్ర హృదయాలకు తగిలిన గాయాలకు ఈ స్పెషల్ స్టేటస్ అనే లేపనాన్ని రాసింది బీజేపీయే.

కానీ, 2014 ఎన్నికల్లో బీజేపీకి లోకసభలో పూర్తి మెజార్టీ రావడం వల్ల, చంద్రబాబునాయుడుపై నరేంద్ర మోడీకి మనసులో అప్పటికే పేరుకుపోయి ఉన్న అసహనం వల్ల ఆంధ్రప్రదేశ్‌ను ఒక పట్టుబట్టాలని మోడీ నిర్ణయించుకుని ఉండడంతో స్పెషల్ స్టేటస్ అనేది అటకెక్కింది. చంద్రబాబునాయుడు పట్ల మోడీ తన అసహనాన్ని, చిరాకును, మానసిక ఆగ్రహాన్ని, చిన్నచూపును ఆయన ఏమీ దాచుకోలేదు.

నిజానికి లోక్‌సభలో బీజేపీకి పూర్తి మెజార్టీ వస్తుందని మోడీ కూడా ఊహించలేదు. చంద్రబాబూ ఊహించలేదు. అందుకే 2014 ఎన్నికలకు ముందు మోడీ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుతో అంత ఫ్రెండ్లీగా ఉన్నారు. తీరా ఫలితాలు వచ్చేసరికి, బాబుతో మోడీకి పని లేకుండా పోయింది. మోడీని ఒక పట్టు పడదామని చంద్రబాబు ప్లాన్ వేసుకుని కూర్చున్నారు. చివరికి మోడీ చేతిలో బాబు దొరికిపోయారు.

2002 గుజరాత్ గోద్రా అల్లర్లను పురస్కరించుకుని, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న తనను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అవమానించిన తీరును మోడీ మరిచిపోలేదు. ఆయనకు ఈ అవమానం అడుగడుగునా గుర్తుకు వస్తూ చంద్రబాబు నాయుడుకు తన స్థాయి, స్థానం ఏమిటో చూపించాలని మోడీ భావించారనడంలో రహస్యం ఏమీ లేదు. అందుకే మోడీ అపాయింట్మెంట్ కూడా ఏపీ ముఖ్యమంత్రికి దొరకని స్థితిని మనం చూశాం.

ఈ స్పెషల్ స్టేటస్ అనేది అటకెక్కడానికి ఇదో ప్రధాన కారణం. తనకు మోడీ చేతుల్లో 'ఇల్ ట్రీట్ ఖాయమనే విషయం 2014 ఎన్నికల ఫలితాల తరువాత చంద్రబాబునాయుడుకూ అర్ధమయింది, కానీ మరీ ఇంతలా ఉంటుందని ఊహించలేదు. అయినా, మోడీ గుజరాతీయుడు కదా! శత్రు శేషాన్ని కూడా వదిలిపెట్టని మానసిక స్థితి గుజరాతీయులది.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం వల్ల, రాష్ట్రానికి తగిలిన మొదటి దెబ్బ ఇది. 2014 ఎన్నికల తరువాత రాష్ట్రంలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ ఈ పరిస్థితిని సహజంగానే తన అస్త్రంగా మలుచుకున్నది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా తీసుకు రాలేకపోతున్నదంటూ టీడీపీని తూర్పారబట్టింది. తిడదామంటే.... అక్క కూతురు, కొడదామంటే గర్భిణీ అన్న సామెత చందంగా టీడీపీ, చంద్రబాబు పరిస్థితి తయారైంది. గట్టిగా మాట్లాడదామనుకుంటే టీడీపీకి బీజేపీ మిత్రపక్షంగా నటిస్తున్నది. పోనీ బతిమిలాడుదాము అంటే మోడీ చంద్రబాబుకు అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదు. (ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఎదుర్కొంటున్న పరిస్థితే. మాటల్లోనేమో జనసేనకు బీజేపీ మిత్రపక్షం. అందుకని బీజేపీని పవన్ కళ్యాణ్ విమర్శించలేడు. చేతల్లో చూద్దామంటే పవన్ కళ్యాణ్‌ను బీజేపీ కేంద్ర నాయకులు కేర్ చెయ్యరు. అపాయింట్మెంట్ కూడా ఇవ్వరు). ఈ పరిస్థితిని వైసీపీ తనకు అనుకూలంగా మార్చుకుంది. "హోదా తేలేక పోతే, బీజేపీతో స్నేహమేంటంటూ"... వైసీపీ దుమ్ము రేపింది. చంద్రబాబు ఇరుక్కుపోయారు. ఒక పక్క 2019 ఎన్నికలు తరుముకు వస్తున్నాయ్. మరో పక్క వైసీపీ ప్రచారహోరు. వైసీపీని అధికారంలోకి తెస్తే, రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తుందనే భావనలో జనం పడిపోతున్నారనే అభద్రతా భావానికి చంద్రబాబు లోనయ్యారు. ఎన్నికలు కనుచూపు మేరలోకి వస్తున్నాయి అనగానే, రాత్రికి రాత్రి ప్లేట్ ఫిరాయించేశారు. అప్పటి దాకా ప్యాకేజ్... ప్యాకేజ్ పాట పాడిన చంద్రబాబు ఒక్కసారిగా మోడీపై తిరుగుబాటు బావుటా ఎగరేశారు. ధర్మానుగ్రహం అన్నారు. నల్లడ్రెస్‌లు వేశారు. మోడీని దుర్భాషలాడారు. వీలైనంతగా కించ పరిచారు. నీ కంటే నేనే సీనియర్‌ని అన్నారు. నా ముందా నీ కుప్పిగంతులు అన్నారు. దేశంలోని అమాంబాపతు రాజకీయపార్టీలను ఏకం పాకం చేసే పని మొదలు పెట్టారు. ప్రత్యేక విమానం వేసుకుని(మన ఖర్చుల మీద) అన్ని రాష్ట్రాలూ తిరిగారు. మోడీని తిట్టి పోశారు. మోడీ కిమ్మనలేదు. నోరు మెదపలేదు. ఎక్కడ తొడపాశం పెట్టాలో అక్కడ పెట్టారు. పోలవరంతో సహా దేనికీ రూపాయి విదిల్చడం మానేశారు. ప్రత్యేకహోదాను తుంగలో తొక్కారు. చంద్రబాబును 23 ఎం.ఎల్.ఏ సీట్లకు, 3 ఎం.పి సీట్లకు పరిమితం చేశారు.

ఇప్పుడు ప్రత్యేకహోదా తెచ్చే బాధ్యత వైసీపీ మీద పడింది. 25 ఎంపీ స్థానాలకు గానూ 22 స్థానాలు వైసీపీకి కట్టబెట్టారు. కనుక వైసీపీపై ఒత్తిడి ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ విషయంలో టీడీపీ ముందు ముందు భారీ ప్రచారానికి దిగుతోంది. 22మంది ఎంపీలను ఇస్తే.. ఏం చేశారని అడుగుతుంది.

ఎన్నికల సమయం సమీపించే కొద్దీ ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. కోతిపుండుగా ఉన్నప్పుడే, ఈ అంశం బ్రహ్మ రాక్షసిగా మారకముందే ముఖ్యమంత్రి జగన్ మేల్కొనాలి. ఆంధ్రకు ప్రత్యేకహోదా ఏ కారణాలతో కేంద్రం ఇవ్వలేకపోతున్నదో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో చెప్పించి ఆ హోదా వల్ల రాష్ట్రానికి ఒనగూరే ఆర్థిక వసతులను రాష్ట్రమే కల్పించాలి. ప్రతి జిల్లాకు ఏడాదికి ఓ వేయి కోట్లు కేటాయించి ఆ మొత్తాన్ని వినియోగించాల్సిన తీరుతెన్నులు, దానివల్ల ప్రజలకు కలిగే విస్తృత ప్రయోజనాలపై మరింత విస్తృతమైన అవేర్నెస్ క్యాంపెయిన్‌లు నిర్వహించాలి. ఈ విషయంలో అలక్ష్యం, అశ్రద్ధ వైసీపీకి ఇబ్బందికరంగా మారకూడదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## ఆత్మకూరు ఆర్డీఓగా చైత్రవర్షిణి



కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేస్తున్న చైత్రవర్షిణి

ఆత్మకూరు ఆర్డీఓగా చైత్రవర్షిణి ఈనెల 23న బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటసుధాకర్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. తిరుపతికి చెందిన తాను గతంలో ఈ జిల్లాలోనే డెప్యూటి కలెక్టర్‌గా 2019లో శిక్షణ పొందానని, కనుక జిల్లా తనకు బాగా సుపరిచితమేనని చెప్పారు. తొలుత, ఆమె జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు.

## అన్నదాతలను ఆదుకోండి

### కలెక్టర్‌కు రైతుసంఘాల సమాఖ్య వినతి

జిల్లాలో ధాన్యం పండించిన రైతులను ఆదుకోవాలని, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేవిధంగా కృషిచేయాలని కోరుతూ రైతు సంఘాల సమాఖ్య నాయకులు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబుకు ఈనెల 23న వినతిపత్రం సమర్పించారు. రైతు నాయకుడు చిరసాని కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఆ సమాఖ్య ప్రతినిధులు కలెక్టర్‌ను కలసి రైతుల సమస్యలను వివరించారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం పుట్టి 16,048 రూపాయలు ఉన్నప్పటికీ, బియ్యంలో విరుగుడు ఉండడం, బాయిల్డ్ బియ్యానికి అనుమతి లేకపోవడంతో రైతులు తక్కువ ధరలకు ఇతరత్రా వ్యాపారులకే అమ్ముకోవాల్సివస్తోందని వారు కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల వల్ల రైతులు ఇప్పటిదాకా రైతుభరోసా కేంద్రాల్లో కేవలం 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యమే అమ్ముకోవడం జరిగిందని, ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో 6 లక్షల ఎకరాల్లో రైతులు ధాన్యం పండించడంతో సుమారు 5లక్షల మెట్రిక్ టన్నుల దాకా దిగుబడి వచ్చే పరిస్థితి ఉందని, కనుక ప్రభుత్వం నిబంధనలు సడలించి రైతులు తాము పండించిన ధాన్యాన్నంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు ధర ఇప్పించేలా చూడాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

వీక్షణం -మంజీర

## పాలనకు కొత్త పుస్తకం

ప్రతి పక్షం అంటే ప్రత్యర్థి పక్షం. అధికార పక్షానికి దీటుగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం నాలుగు పాదాల మీద నడుస్తుంది. మరి ప్రతిపక్షం ప్రతి... పక్షంరోజులకో వైఫల్యాన్ని చవి చూస్తుంటే? ఆ పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతోందా అనే సందేహం ప్రజల్లో కలుగుతుంటే? మొదట ప్రత్యర్థి పార్టీ నాయకులు మాటల బాణాలు వదులుతారు. ఆ తర్వాత సొంత పార్టీ నాయకులు గుసగుసలు పోతారు. ‘ఈ పార్టీని మనం ఇంకా ఎన్నాళ్లు మోయాలి? నడిపేవాడు, నడపాల్సిన వాడు ‘నడపడం’ మర్చిపోతుంటే, నడపాల్సింది తానేనన్న విషయాన్ని కూడా ఆదమరుస్తూ ఉంటే... మనం మాత్రం ఎన్నాళ్లని ఆ లోటును బయట పడనివ్వకుండా పార్టీ గౌరవాన్ని కాపాడగలుగుతాం. మనం ఎంతగా తెడ్లు వేసి పడవను ముందుకు నడిపించినప్పటికీ మన భుజాలు నొప్పెట్టడమే మిగులుతోంది!’ పార్టీలో ఏ ఇద్దరు ఆంతరంగికులు కలిసినా వారి సంభాషణలో ఇలాంటి మాటలే వినిపిస్తాయి. ఇప్పుడు ఏపీ పరిస్థితి అలాగే కనిపిస్తోంది. చంద్రుడికి శుక్లపక్షం, కృష్ణపక్షం తప్పవని తెలిసిందే. అయితే ఇక్కడ తమ చంద్రుడి జీవితంలో శుక్ల పక్షం పూర్తయి, కృష్ణపక్షం మాత్రమే మిగిలిందా అనే సందేహాలు మొదలయ్యాయి. శుక్లపక్షం మళ్లీ వస్తుందనే ఆశ ఉంటే ఈ కృష్ణపక్ష కాలంలో దివిటీలు పెట్టి వెలుగునివ్వడానికి అనుచరులు ఏవో తంటాలు పడవచ్చు. ‘ఇక మిగిలింది కృష్ణపక్షమే అయితే? మనం పట్టే దివిటీలు ఎన్నాళ్లని వెలుగుతాయి? సొంత చమురు వేసి ఎన్నాళ్లని దివిటీలను వెలిగించగలం?’ అనే సమాధానం లేని ప్రశ్నలు తలెత్తుతాయి. ఇది ఏపీ ప్రతిపక్షానికి కూడా సమాధానం లేని పెద్ద ప్రశ్న. మాచియవెల్లీని చదివిన నాయకుడి భవిష్యత్తు!

### తాయిలాల పరంపర!

ఇటలీకి చెందిన నికోలో మాచియవెల్లీ గొప్ప రాజనీతిజ్ఞుడు. పదహారో శతాబ్దానికి చెందిన వాడు. మాచియవెల్లీ రాసిన గ్రంథం పేరు ‘ది ప్రిన్స్’. అందులో పాలకుడు అనుసరించాల్సిన అనేక నియమాలను ఉదహరించాడు రచయిత. అందులో ఒకటి... ‘పాలకుడు తన ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను వారికి విడతల వారీగా ఇస్తూ ఉండాలి. ఎందుకంటే పాలకుడు తీసుకున్న నిర్ణయం కొద్దిరోజుల పాటు మౌఖిక ప్రచారంలో ఉంటుంది. ప్రజల నాలుకల మీద నలుగుతూ ఉంటుంది. ఇచ్చేది ఒక్క రూపాయే అయినా సరే, ఆ రూపాయిని నాలుగు దఫాలుగా నాలుగు పావలాలు ఇవ్వాలనేది మాచియవెల్లీ మాట. అలాగే రాజ్య మనుగడ కోసం ప్రజలపై మోపక తప్పని భారాన్ని మాత్రం ఒక్కసారిగా విధించేయాలి. ఉదాహరణకు బస్సు చార్జీలు, పెట్రోలు ధరలు ఏవైనా సరే... పెరిగిన అదనపు భారం పది పైసలైనా పది రోజులు ప్రజల్లో నలుగుతుంది. ఒక్కసారిగా రూపాయి పెరిగినా సరే... అది కూడా పది రోజుల పాటు మాత్రమే నలుగుతుంది. ఆ తర్వాత జనం మర్చిపోతారు. ఇదీ రాజనీతి చెప్పే మౌలిక సూత్రం. నిజానికి మాచియవెల్లీ రాయడానికంటే దాదాపుగా పద్దెనిమిది వందల ఏళ్ల కిందటే కౌటిల్యుడు అర్థశాస్త్రాన్ని రాశాడు. అందులో కూడా ఇలాంటి ఎన్నింటినో ఉదహరించాడు. పొలిటికల్ సైన్స్ చదివిన చంద్రన్నకు ఇది ఎస్వీ యూనివర్సిటీ పెట్టిన విద్య. సీఎం అయ్యే నాటికి ఈ అధ్యాయాలన్నీ బుర్రలో తాజాగానే ఉండి ఉండవచ్చు. కాలం గడిచే కొద్దీ ఒకరి సిద్ధాంతాలను తాను అనుసరించేదేమిటి? ‘తానే ఒక సిద్ధాంతం’ అనుకున్నట్లున్నాడు. ఒక తరమంత అనుభవం ఉన్నప్పటికీ కొత్త తరం దూకుడుతో పోటీ పడడంలో వెనుకపడక తప్పడం లేదు. సంక్షేమం అంటే ఏమిటో చేతల్లో చూపిస్తున్నాడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.

### చాణక్యం ఏమైంది?


అధినేతను ‘రాజనీతిలో అపర చాణుక్యుడు’ అని, ‘పరిపాలనలో శ్రీకృష్ణదేవరాయలు, కంటి చూపుతో శాసనాలు చేయగల మేధావి, చూపుడు వేలితో కార్యనిర్వహణను కంట్రోల్ చేయగల సమర్థుడు’... ఇలాంటి మకుటాలతో ఆకాశానికెత్తిన అనుచరులు ఇప్పుడు ఇదే మకుటాలతో మరో నాయకుడిని తల మీదకెత్తుకోవడానికి సిద్ధమైపోతున్నారు. ఈ అధి నాయకుడు కూడా తనలో ఒకప్పుడు మెరిసిన చాణక్యాన్ని నిలుపుకోవడంలో కొంత అజాగ్రత్తగా ఉన్నట్లున్నాడు. ‘ది ప్రిన్స్’ పుస్తకానికి ప్రతిరూపంగా మెరిసిన కాలం ఇప్పుడు కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త రాజనీతి పుస్తకాల అవసరం వచ్చినట్లుంది. ఎందుకంటే అదే రాజనీతి పుస్తకాలను, ఒకప్పుడు పాలకుల కోసం నిర్దేశించిన ఆ పుస్తకాలను... ఇప్పుడు జనం కూడా చదివేశారు. రాజనీతిజ్ఞులు కొత్త పుస్తకాలను రాసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

### భవిష్యత్తు సరే! వర్తమానం మాటేమిటి?

‘అనుచరులకు భరోసా కలిగించగలిగిన వాడే నాయకుడు’. ఇది కూడా రాజనీతి మౌలిక సూత్రమే. అలాంటిది ఇప్పుడు అనుచరుల అండ చూసుకుని నాయకుడు భుజం తట్టుకోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది. అనుచరులకు గొడుగుగా రక్షణనివ్వాల్సిన పార్టీ, అనుచరులను కాపాడుకోలేక ప్రజల మీద విరుచుకు పడుతోంది. యువ సీఎం వేగంతో ముప్పేట దాడికి గురవుతున్నట్లవుతోంది ప్రతి పక్షం పరిస్థితి. అధినాయకుడిలో సంయమన లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ‘ఇది ప్రజల తీర్పు’ అనాల్సిన పరిణతి ఎందుకో లోపించింది. ‘ఇది ప్రజల వంచన’ అని ఆత్మవంచనకు కూడా వెనుకాడని ప్రకటనలు నాలుక చివర ఉంటున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే పంచాయితీల మీద పట్టు పోయింది. మున్సిపాలిటీల ఆశ కూడా నిలవలేదు. ఇక మండలాలు ‘ముందుంది మొసళ్ల పండుగ’ అని భయపెడుతున్నాయి. ఇది మా నాయకుడి ‘విజన్’ అని గర్వంగా చెప్పుకునే రోజు వర్తమానమే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఇప్పుడు వర్తమానమే ప్రశ్నార్థకంలో పడింది. ప్రతిపక్షం బలహీన పడితే ప్రజాస్వామ్యం చూస్తూ ఊరుకోదు. మరో పార్టీకి రహదారి వేస్తుంది.

గ్రంథ సమీక్ష

## భక్తిని, నీతిని ప్రభోదించే.. ‘శ్రీ కోదండరామ శతకము’




రచన :
కీ॥శే॥ బద్వీటి వేంకటనరసింహయ్య
వెల : అమూల్యం పేజీలు : 88
ప్రతులకు: బద్వీటి వేంకటేశ్వరరావు
ప్లాటు నెం. 101, రామనాథయ్య భవనం,
వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా,
సిఆర్ దాసు రోడ్, సంతపేట, ఒంగోలు.

పురాణాలో, కావ్యాలో తెలియని వారుంటారు లేదా చదవని వారుంటారు. కానీ శతకాలు తెలియని వారు అరుదు. శతకం అంతా రాకపోయినా ఒకటో, రెండో, అంతకు మించో పద్యాలు తెలియని వారుండరు. ముఖ్యంగా తెలుగువారు శతకప్రియులు. వేమన, సుమతీ, దాశరధీ శతకాలలోని పద్యాలు వారి దైనందిన జీవితంలో ప్రధాన భాగాలు. సంభాషణల్లో వాటిని ఉదహరించని తెలుగువాడు ఉండడు. అంతగా జనంతో పెనవేసుకపోయాయి శతక పద్యాలు. అంతేకాక కవి అయినవాడు ఎన్ని కావ్యాలు రాసినా, ఎంత పేరుమోసినా.. శతకం రాయ కుండా ఉండడు. ఏదిఏమైనా తెలుగుసాహిత్యంలో శతకానిది అగ్రస్థానం అని చెప్పకతప్పదు.

క్రీ.శ. 1899 సం॥ ప్రకాశం జిల్లా పెద్దార వీడు గ్రామంలో లక్ష్మమ్మ, వేంకటక్రిష్ణయ్యలకు జన్మించిన బద్వీటి వేంకట నరసింహయ్యకు సహజంగానే కవితా సృజన అబ్బింది. తనకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్నే ఆయన కొనసాగిస్తూ హరికథలు చెప్తుండేవారు. ఆ విధంగా ఆయన నిత్యం దైవ నామస్మరణకు అంకితం అయిపోయారు. భగవంతుని మీద తనకున్న అచంచల భక్తి విశ్వాసాలతో తన స్వగ్రామంలో వెలసి ఉన్న కోదండరామ స్వామిని కీర్తిస్తూ ఈ శతకాన్ని రాశారు.

అయితే వేంకట నరసంహయ్య గారు రాసిన శతకం కేవలం దైవభక్తికి సంబంధించిననదేనని అనుకుంటే పారపాటే ! దైవభక్తితో పాటు, సామాజిక సమస్యలు, నీతి నియమాలు, దానధర్మాలు, మూఢనమ్మకాలు మొదలైన విషయాలు వివరించే పద్యాలెన్నో రాశారు. మరొక విషయం ఏమంటే అవన్నీ సీస పద్యాలే కావడం ! సామాన్యునికి సైతం అర్థమయ్యే సరళ గ్రాంధికంలో రచన సాగడం !! ప్రాచీన కవుల ఒరవడిని తలపింపచేస్తూ, అలంకారయుక్తంగా, హాస్యరసస్ఫోరకంగా, వ్యంజనా వైభవస్ఫూర్తితో పద్యాలను రచించారు. నరసింహ శతకం, దాశరధీ శతకాలలోని పద్య పోకడలు ఈ పద్యాలను చదివినపుడు గుర్తుకొస్తాయి. సమాజంలో ప్రస్తుతం నెలకొన్న ధోరణులను ప్రతిబింబిస్తాయి. గ్రాంధిక భాష, శిష్ట వ్యవహారిక భాష, అక్కడక్కడ సందర్భోచితంగా పామరభాష కన్పించి, పాఠకులను అలరిస్తుంది. ఒక పద్యంలో మరొక పద్యాన్ని ఇమిడ్చి రాయటం అనే గర్భకవిత్వం కవిగారి ప్రతిభను తేటతెల్లం చేస్తుంది.

*“విబుధ నుతనామ శ్రీ యారవీటిధామ*
*దండి తారాతి భీమ కోదండరామ”..* అనే మకుటం అంత్యాను ప్రాసతో అలరారుతూ కోదండ రాముని పరాక్రమాన్ని చాటుతూ భక్తి భావ రంజకంగా ఉంది. స్థాలీపులాక న్యాయంగా కవిగారి ఒక పద్యాన్ని ఉదహరిస్తాను. సీ॥ పదివేలమంది రంభలను వరించిన / మోహంబునకు తుది ముట్టబోదు / కాంచన గిరిపైన కాపురం బుండిన / ధనముపైన విరక్తి కలుగబోదు / ముల్లోకముల నొక మొగి మ్రింగి త్రేన్చిన / కోపంబునకు శాంతి కుదరబోదు / అష్టకష్టంబుల ననుభవించుచునున్న / సంసార విభ్రాంతి సడలబోదు / తే॥గీ॥ ఇందుగల సౌఖ్యమెల్ల నీయందు భక్తి / నిల్పి సేవించి పాపముల్ నీరుజేతు / విబుధనుత నామ శ్రీ యారవీటిధామ / దండితారాతి భీమ కోదండరామ। కోర్కెలకంతం ఉండదు. ఎన్ని కోరికలు తీరినా తృప్తి ఉండదు. ఒక్క భగవద్భక్తిలోనే సుఖమూ, శాంతీ ఉన్నాయంటూ కవి ఎంతో చక్కగా బోధించారు. ముఖ్య విషయం ఏమంటే తాతగారి రాతప్రతిని జాగ్రత్త చేయడమే కాకుండా, దాన్ని వ్యయప్రయాసలకోర్చి ముద్రించి లోకానికి అందించి, మనవడు బద్వీటి వేంకటేశ్వరరావు తాత గారి రుణం తీర్చుకున్నాడు. అందుకు ఆయన్ను అభినందించాల్సిందే! ఈ సంగతి అన్నమయ్య సంకీర్తనలను వారి కుమారుడు పెదతిరుమలయ్య రాగిరేకుల మీద చెక్కించి భద్రపరచడాన్ని గుర్తుకు తెచ్చి ఒళ్లు పులక రింపజేస్తుంది. మొత్తంమీద శతకసాహిత్యం గొప్పదనాన్ని తెలిపే గ్రంథం ఇది. అవశ్యం పఠనీయం.



సమీక్ష : డా. గంగిశెట్టి శివకుమార్
ఫోన్ : 9441895343

## తిరుపతి ఉప ఎన్నికకు నోటిఫికేషన్

తిరుపతి లోక్‌సభ స్థానం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ చక్రధర్ బాబు ఈనెల 23వ తేది ఉదయం నోటిఫికేషన్ ప్రకటన విడుదల చేశారు. దీంతో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నెల్లూరులోని తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన నామినేషన్ల కేంద్రానికి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా జేసీ టి.బాపిరెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈనెల 30వ తేది వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఉప ఎన్నిక ప్రక్రియ కలెక్టరేట్ కేంద్రంగా జరుగుతుండడంతో కలెక్టరేట్ ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

# సుప్రీం స్థానానికి.. జస్టిస్ రమణ



**సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణను భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తి పదవికి సిజెఐ జస్టిస్ ఎస్ఏ బోబ్డే ప్రతిపాదించారు. ఆ మేరకు ఆయన ఈనెల 24న కేంద్ర న్యాయశాఖకు లేఖ రాశారు. సంప్రదాయం ప్రకారం న్యాయశాఖ ఆ లేఖను ప్రధానమంత్రి పరిశీలనకు పంపుతారు. ఆయన ఆమోదం అనంతరం రాష్ట్రపతి పరిశీలనకు వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోదంతో భారత తదుపరి ప్రధాన న్యాయ మూర్తి బాధ్యతలు చేపడతారని భావిస్తున్నారు.**

ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే ఏప్రిల్ 23వ తేదిన పదవీ వరమణ చేయబోతున్నారు. తర్వాత ఏప్రిల్ 24న భారతదేశ 48వ ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం జరుగుతుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే అదే రోజున జస్టిస్ రమణ దేశ అత్యున్నత న్యాయస్థానానికి అధిపతిగా ప్రమాణస్వీకారం చేయొచ్చని భావిస్తున్నారు. జస్టిస్ ఎన్‌వి రమణ పదవీకాలం 2022 ఆగస్టు 26 వరకు ఉంది.

## తెలుగు జాతి ఆణిముత్యం...

ఒక తెలుగు వ్యక్తి దాదాపు 55 ఏళ్ళ తర్వాత దేశ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే చరిత్రాత్మక ఘట్టం త్వరలోనే ఆవిష్కృతం కాబోతుందని అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ అత్యున్నతమైన పదవిని చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి జస్టిస్ కోకా సుబ్బారావు, అప్పట్లో 1966 జూన్30 నుంచి 1967 ఏప్రిల్ 11వతేది దాకా సుప్రీంకోర్టు 9వ చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆ పదవిని రెండవ తెలుగు వ్యక్తి ఎన్‌వి.రమణ స్వీకరించనున్నారని భావిస్తూ తెలుగువారంతా సంతోషపడుతున్నారు.

అత్యున్నతమైన పదవిని అందుకునే దిశగా పయనిస్తున్న జస్టిస్ రమణ తెలుగువారి ఆణిముత్యం. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా పొన్నవరం గ్రామంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. బిఎస్సీ చదివి న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్న తర్వాత అంచలంచెలుగా ఎదుగుతూ హైకోర్టు న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నతస్థాయికి చేరుకుని ఎన్నో సంచలనాత్మక తీర్పులు వెల్లడించారు.

## సిఎం జగన్ ఫిర్యాదును డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

జస్టిస్ ఎన్‌వి రమణతో పాటు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని న్యాయమూర్తులపై ఆరోపణలు చేస్తూ గత ఏడాది అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డేకి చేసిన ఫిర్యాదును సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆ మేరకు ఈనెల 24న అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆ ఫిర్యాదును సంపూర్ణంగా పరిశీలించామని, పరిశీలన అనంతరం డిస్మిస్ చేశామని, అంతర్గత నిబంధనలకు అనుగుణంగా ఆ అంశాలు గోప్యమైనవైనందున వాటిని బహిర్గతం చేయడం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నట్లు సమాచారం.



# కర్నూలుకు ఇక రయ్‌మంటూ.. విమానాలు

> విమానాశ్రయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్

**ఎన్నో ఏళ్ళుగా ఇదిగో అదిగో అంటూ అనుకుంటున్న విమానాశ్రయం రానే వచ్చింది. దీంతో ఎంతోకాలంగా ఇలాంటి అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న కర్నూలీయుల కల సాకారమైనట్లయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 24వ తేది గురువారం మధ్యాహ్నం 12.35 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి ప్రారంభోత్సవం చేశారు. దీంతో ఇక నుంచి కర్నూలుకు విమాన ప్రయాణ సౌకర్యం కలగడంతో కర్నూలు ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.**

దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా నిర్మించిన కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. ఆ విమానాశ్రయానికి ఈనెల 24వ తేది మధ్యాహ్నం 12.18 గంటలకు ముఖ్యమంత్రి జగన్ ప్రారంభోత్సవం చేయడంతో కర్నూలు ప్రజలే కాక, రాష్ట్ర ప్రజలు, దేశవ్యాప్తంగా ఉన్న ఈ ప్రాంతాల వారంతా సంబరపడి పోతున్నారు.

గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో సిఎం జగన్ గురువారం ఉదయం 11.45 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి వచ్చి, మధ్యాహ్నం 12 గంటలకు జ్యోతి వెలిగించి ఆ తర్వాత టెర్మినల్ భవనం వద్ద ఏర్పాటుచేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. కర్నూలు ప్రజలు, స్థానిక నాయకులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ కర్నూలుకు రోడ్డు, రైలు మార్గంలోనే ప్రయాణం ఉందని, ఇక నుండి విమాన ప్రయాణం కూడా జరగబోతోందని అన్నారు. 110 కోట్లు ఖర్చు చేసి కేవలం ఏడాదిన్నర లోపే ఈ పనులను పూర్తి చేశామని చెప్పారు. ఈ గడ్డ నుండే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వచ్చారని అంటూ ఈ ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరును సిఎం ప్రకటించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవంలో సీఎం జగన్‌తో పాటు కేంద్రమంత్రి హరదీప్‌సింగ్ కూడా పాల్గొన్నారు.

కర్నూలు ఎయిర్‌పోర్ట్ ప్రారంభం కావడంతో ఇకనుంచి కర్నూలుకు విమానాల రాకపోకలు నిర్ణయించిన వేళల్లో జరుగుతాయి. విమానం ద్వారా కర్నూలు నుంచి బెంగుళూరు, చెన్నై, విశాఖలకు ఇక గంటల్లోనే ప్రయాణం చేసే వీలుంటుంది. ఇండిగో సంస్థ విమాన సర్వీసులను నడననుంది. ఈనెల 28వ తేదీ నుంచి ఆ సంస్థ విమాన ప్రయాణాలను నడపడానికి అన్ని ఏర్పాట్లు చేసింది.



## విమాన ప్రయాణాల వేళలు

బెంగుళూరు నుంచి విమానం ప్రతి సోమవారం, బుధ, శుక్ర, ఆదివారాల్లో ఉదయం 9.05 గంటలకు బయలుదేరి, 10.10 గంటలకు కర్నూలుకు చేరుతుంది. తిరిగి అదేరోజు మధ్యాహ్నం 3.15 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 4.25 గంటలకల్లా విమానం బెంగుళూరుకు చేరుకోనుంది. అదేవిధంగా ప్రతి సోమవారం, బుధ, శుక్ర, ఆదివారాల రోజుల్లో కర్నూలు నుంచి ఉదయం 10.30 గంటలకు బయలుదేరి విశాఖపట్నానికి 12.40 గంటలకు చేరుతుంది. అదే రోజుల్లో తిరిగి విశాఖ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి 2.55 గంటలకల్లా కర్నూలుకు చేరుకోనుంది. చెన్నై నుంచి ప్రతి మంగళవారం, గురు, శని, ఆదివారాల రోజుల్లో మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి కర్నూలుకు 4.10 గంటలకు చేరుకుంటుంది. అదే రోజుల్లో కర్నూలు నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి చెన్నైకి సాయంత్రం 5.30 గంటలకు చేరుతుందని విమానాశ్రయ వర్గాలు పేర్కొన్నాయి.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com